


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


నంద్యాల జిల్లాలో గిరిజన విభాగం విస్తృత స్థాయి సమావేశం.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 167 పేజీలు - 08 వెల - 05/- మంగళవారం 16-06-2026


## సింగపూర్ ప్రధానితో సీఎం
# చంద్రబాబు భేటి




**అర్బన్ గవర్నెన్స్‌లో సింగపూర్ సహకారం కోరిన సీఎం**

**● సెమీకండక్టర్లు, క్వాంటం, యూనివర్సిటీ పరిశోధనల తోడ్పాటుకు విజ్ఞప్తి ● ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని కోరిన ముఖ్యమంత్రి ● అమరావతి రాజధాని నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్న సింగపూర్ ప్రధాని ● ఏపీ-సింగపూర్ మధ్య ఎయిర్ కనెక్టివిటీపై విదేశీ వ్యవహారాల మంత్రితో సీఎం చర్చ ● సింగపూర్ పర్యటనలో ఆ దేశ ప్రధాని, విదేశీ వ్యవహారాల మంత్రులతో వేర్వేరుగా సీఎం భేటీ**

సింగపూర్, జూన్ 15 ?? ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యంతో పండించిన ఉద్యాన ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులను దిగుమతి చేసుకునే అంశాలను పరిశీలించాలని సింగపూర్ ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం సోమవారం ఆ దేశ ప్రధాన మంత్రితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సింగపూర్ ప్రధాని అధికారిక నివాసంలో 30 నిముషాల సేపు ఇరువురు నేతలూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహా యూనివర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించి సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. సెమీ కండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్, కెపాసిటి బిల్డింగ్‌లో తోడ్పాటు అందించాలని సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌కు విజ్ఞప్తి చేశారు. అమరావతి సహా రాష్ట్రంలోని వివిధ నగర, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ గవర్నెన్స్‌లోనూ సహకారం కోరుతున్నట్టు సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పంటలు పండిస్తున్నట్టు సింగపూర్ ప్రధానికి సీఎం వివరించారు. ఏపీలోని ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగైన ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఆయనకు తెలిపారు. పోర్టులు- ఎయిర్ పోర్టుల అభివృద్ధితో పాటు వివిధ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ-సింగపూర్‌లు కలిసి పనిచేయాలని కోరారు. ఇరువురు నేతల మధ్య జరిగిన చర్చల్లో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణాల గురించి సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో విద్యాసంస్థలు,

మిగతా 2లో

# మెట్రో ఫేజ్-2కు
## అడ్డంకులు సృష్టిస్తున్న ముగ్గురే: సీఎం

**హైదరాబాద్ మెట్రోకు న్యాయం చేయాలి'..**

**● కేసీఆర్, కేటీఆర్ ఆడిస్తున్నారు, కిషన్‌రెడ్డి ఆడుతున్నారు ● మెట్రో ఫేజ్-2కు మోకాలడ్డుతున్నది వారే.. ● రైల్వే లోన్ రాకుండా కుట్రలు చేస్తున్నారు ● ఎన్ఓసీ ఇప్పిస్తారో లేదో తేల్చి చెప్పాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్**




హైదరాబాద్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఫైర్ అయ్యారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఫేజ్-2ను అడ్డుకుంటున్నది ముమ్మాటికీ ఆయనేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్), ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు (కేటీఆర్) చెప్పినట్టుగా కిషన్‌రెడ్డి నడుచుకుంటూ ఉద్దేశపూర్వ కంగా రాష్ట్రాభివృద్ధికి మోకాలడ్డుతున్నారని విమర్శించారు. కేటీఆర్ చీటి రాసిస్తున్నారు.. దాంట్లో ఉన్నదాన్నే కేంద్ర మంత్రి అమలు చేసి చూపుతున్నారంటూ ఎద్దేవా చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ ఎస్ ఓట్లను గంపగుత్తగా బీజేపీకి వేయించారు, ఆ కృతజ్ఞత తీర్చుకునే పనిలో భాగంగానే కిషన్ రెడ్డి.. కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లో మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రులు అశ్వనీ వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్‌తో మంతనాలు సాగించటం ద్వారా ఇండియన్ రైల్వే

మిగతాది 2లో

## అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం : భారతీయులకు 5 విధాలుగా ఊరట



2

- అమెరికా-ఇరాన్ మధ్య కుదరనున్న శాంతి ఒప్పందంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి
- భారతదేశంపై ఐదు కీలక రంగాల్లో సానుకూల ప్రభావం చూపే అవకాశం
- పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గుముఖం పట్టే సూచనలు
- రవాణా, విమానయాన చార్జీలు తగ్గి ఆహార ద్రవ్యోల్బణానికి కళ్లెం
- వడ్డీ రేట్లు తగ్గించి ఈఎంఐలు తగ్గించే దిశగా ఆర్బీఐకి వెసులుబాటు

అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. దశాబ్దాలుగా

## సీజేపీ వ్యవస్థాపకుడిపై దాడి

2



**● అభిజిత్ దీప్కే చెంపపై కొట్టిన దుండగులు ● జైపూర్ లో ఆందోళన చేస్తుండగా దౌర్జన్యం ● దాడి చేసిన వారిని చితకబాదిన ● కాక్రోచ్ పార్టీకార్యకర్తలు**

జైపూర్ : రాజస్తాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. నీట్‌తో సహా వివిధ జాతీయ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జైపూర్

# రామాయణంపై వ్యాఖ్య..
## నటుడు ప్రకాశ్ రాజ్‌పై తిరుపతి కోర్టులో ఫిర్యాదు

**కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఈ ఫిర్యాదు**



- నటుడు ప్రకాశ్ రాజ్‌పై తిరుపతి కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు
- రామాయణం, శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ
- బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఈ ఫిర్యాదు దాఖలు

ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై తిరుపతి కోర్టులో సోమవారం క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. రామాయణం, హిందూ దేవతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి ఈ ఫిర్యాదు చేశారు. తిరుపతిలోని నాలుగో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌తో పాటు పలు బహిరంగ వేదికలపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన శ్రీరాముడు, లక్ష్మణుడు దక్షిణాదిపై (లంకగా పోలుస్తూ)

మిగతాది 2లో

## బద్రీనాథ్ క్షేత్రానికి ముఖేశ్ అంబానీ కళ్లు చెదిరే విరాళం



2

- బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలను దర్శించుకున్న ముఖేశ్ అంబానీ
- ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం రూ.10 కోట్ల విరాళం అందజేత
- దేశ శ్రేయస్సు కోరుతూ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన వైనం

చార్‌ధామ్ యాత్ర నేపథ్యంలో అంబానీ ఆధ్యాత్మిక పర్యటన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ బద్రీనాథ్ క్షేత్రానికి భారీ విరాళం ప్రకటించారు.

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను
# ఒప్పించలేకపోయారు



- హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు అనుమతులు తేలేకపోవడం రేవంత్ ప్రభుత్వ వైఫల్యమేనన్న కేటీఆర్
- ఓటుకు నోటు కేసు భయంతోనే బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపణ
- మెట్రో వైఫల్యంపై సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

2

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యూపీ, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తేలేకపోయారో రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

# తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..




2

- తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యమెందుకని ప్రశ్న
- రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందన్న పవన్ కల్యాణ్
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం జనసేన పనిచేస్తుందన్న పవన్

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని

## ఎయిరిండియాలో క్లీనింగ్ కార్మికుడు..
## కానీ తన మాటలతో ఇంటర్నెట్ హీరో అయ్యాడు!

- ఎయిర్ ఇండియా క్లీనింగ్ సిబ్బందికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ఎయిర్ ఇండియాలో పనిచేయడమే తన కల అని చెప్పిన ఉద్యోగి
- వర్ష అనే ఇన్?స్టాగ్రామ్ యూజర్ పోస్ట్ చేయడంతో వెలుగులోకి వచ్చిన ఘటన
- ఉద్యోగి అంకితభావం, సంతోషంపై నెటిజన్ల ప్రశంసల వర్షం

ఎయిరిండియాలో క్లీనింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న ఒక సామాన్య ఉద్యోగి తన వృత్తి పట్ల ప్రదర్శించిన అంకితభావం, నిబద్ధత ప్రస్తుతం నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. అతడితో జరిపిన ఒక చిన్న సంభాషణకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో, తెర వెనుక శ్రమించే ఇలాంటి ఎందరో సామాన్య ఉద్యోగుల స్ఫూర్తిదాయక కథనాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.

# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం: భారతీయులకు 5 విధాలుగా ఊరట

పరిణామం చోటుచేసుకుంటోంది. దశాబ్దాలుగా ఉప్పునిప్పులా ఉన్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే సూచనలు కనిపిస్తున్నాయి. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, కాల్పుల విరమణ పొడిగింపు, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు చర్చల పునరుద్ధరణ వంటి అంశాలతో కూడిన ఈ ముసాయిదా ఒప్పందంపై ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోంది. ఈ ఒప్పందం కార్యరూపం దాలిస్తే, అది ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలను, రవాణా ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుంది. ఈ వార్తల నేపథ్యంలో ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు తగ్గడం ప్రారంభించాయి. 'న్యూస్ 18' కథనం ప్రకారం... ఈ పరిణామం భారతదేశానికి, ముఖ్యంగా సామాన్య ప్రజలకు అనేక విధాలుగా మేలు చేయనుంది. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ఇందులో సుమారు 60 శాతం చమురు హోర్ముజ్ జలసంధి మార్గం గుండానే రవాణా అవుతుంది. ప్రపంచంలోని మొత్తం చమురు వాణిజ్యంలో 20 శాతం ఇక్కడి నుంచే సాగుతుంది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గితే, అది భారత ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరటనిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా భారతీయులు పొందగల ఐదు ప్రధాన ప్రయోజనాలను ఇప్పుడు చూద్దాం. 1. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గుదల

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గితే, దాని ప్రత్యక్ష ప్రభావం దేశీయ పెట్రోల్, డీజిల్ ధరలపై పడుతుంది. ఇరాన్ నుంచి చమురు సరఫరా పెరిగే అవకాశం ఉండటం, రవాణా మార్గాలపై రిస్క్ ప్రీమియం తగ్గడం వంటి కారణాలతో చమురు ధరలు దిగివస్తాయి. ఇది వాహనదారులకు తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. లేదా కనీసం ధరల పెంపునకు అడ్డుకట్ట వేస్తుంది. 2. విమాన ప్రయాణ చార్జీలు చౌక

చమురు ధరల తగ్గుదల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను కూడా తగ్గిస్తుంది. విమానయాన సంస్థలకు నిర్వహణ వ్యయంలో ఇంధనానిదే సింహభాగం. ఏటీఎఫ్ ధరలు తగ్గితే, విమానయాన సంస్థలు దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో, ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్లే విమానాల టికెట్ ధరలను తగ్గించే అవకాశం ఉంటుంది. 3. ఆహార ద్రవ్యోల్బణానికి కళ్లెం డీజిల్ ధరలు తగ్గితే కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర సరుకుల రవాణా ఖర్చులు తగ్గుతాయి. ఇది ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, గల్ఫ్ దేశాలు యూరియా వంటి ఎరువుల ప్రధాన ఎగుమతిదారులు. ఇంధన సంక్షోభం తగ్గితే, ఎరువుల ధరలు కూడా స్థిరంగా ఉంటాయి. ఇది రైతులకు మేలు చేసి, అంతిమంగా సామాన్యుడి కిచెన్ బడ్జెట్‌ను అదుపులో ఉంచుతుంది. 4. వంట గ్యాస్ (గ్యా+) ధరల స్థిరత్వం ఇంధన మార్కెట్లపై ఒత్తిడి తగ్గడం, రవాణా, బీమా ఖర్చులు తగ్గడంతో ఎల్పీజీ సిలిండర్ల ధరలు స్థిరంగా ఉంటాయి. అంతర్జాతీయంగా ధరలు తగ్గితే, ప్రభుత్వంపై సబ్సిడీ భారం కూడా తగ్గుతుంది. ఇది గృహ వినియోగదారులకు ఎంతో ఊరటనిస్తుంది. 5. ఈఎంఐలు తగ్గే అవకాశం

ఇంధన ధరల తగ్గుదల మొత్తం ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెస్తుంది. ఇది భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×) వడ్డీ రేట్లను తగ్గించడానికి లేదా యథాతథంగా కొనసాగించడానికి వెసులుబాటు కల్పిస్తుంది. వడ్డీ రేట్లు తగ్గితే, గృహ, వాహన, వ్యాపార రుణాలపై చెల్లించే నెలవారీ వాయిదాలు (జువీ×లు) తగ్గుతాయి. మొత్తం మీద, ఈ శాంతి ఒప్పందం ముసాయిదా దశలో ఉన్నప్పటికీ, అది వాస్తవరూపం దాలిస్తే భారత ఆర్థిక వ్యవస్థకు గొప్ప స్థిరత్వాన్ని అందించి, సామాన్యుడి జీవితంపై సానుకూల ప్రభావం చూపిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ఈ ప్రయోజనాలన్నీ ఒప్పందం ఎంత వేగంగా అమలవుతుంది, చమురు మార్కెట్లు ఎలా స్పందిస్తాయి అనే దానిపై ఆధారపడి ఉంటాయి.

# మెట్రో ఫేజ్-2కు అడ్డంకులు సృష్టిస్తున్న ముగ్గురే: సీఎం

బీఆర్ ఎస్ ఓట్లను గంపగుత్తగా బీజేపీకి వేయించారు, ఆ కృతజ్ఞత తీర్చుకునే పనిలో భాగంగానే కిషన్ రెడ్డి.. కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లో మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రులు అశ్వనీ వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్‌తో మంతనాలు సాగించటం ద్వారా ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐ.ఆర్.ఎఫ్.సీ) నుంచి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు లోన్ రాకుండా మోకాలడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి ఎన్‌వోసీ ఇప్పిస్తారా? లేదా? అంటూ కిషన్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేష్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కిషన్ రెడ్డిపై తనకు గౌరవం ఉంది... అదే సమయంలో ఆయనపై అసహనం కూడా ఉందన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ పుట్టు పూర్వోత్తరాలను 2004 నుంచి సోదాహరణంగా వివరించారు. అంతర్జాతీయ నగరానికి అంతర్జాతీయ ప్రమాణాలతో రవాణా సౌకర్యాలు ఉండాలనే ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ హయాంలో ఆనాటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి జైపాల్ రెడ్డి హైదరాబాద్ కు మెట్రో ప్రాజెక్టు తీసుకొచ్చారని వివరించారు. వైఎస్ మరణానంతరం రోశయ్య హయాంలో మొదటిదశ మెట్రో కోసం ఒప్పందాలు జరిగాయని తెలిపారు. ఆ క్రమంలో 2017 నాటికి మెట్రో మొదటి దశ పూర్తి చేయాలనేదే లక్ష్యంగా ప్రాజెక్టు మొదలైందని అన్నారు. కానీ తెలంగాణ వచ్చాక చారిత్రక కట్టడాల సాకుతో మెట్రో మొదటి దశను అడ్డుకున్నారని బీఆర్ ఎస్ సర్కారును ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ చర్యలతో మెట్రో మొదటి దశ మూడేళ్లు ఆలస్యమైందని పేర్కొన్నారు. ఇదే సమయంలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు అంచనాలు రూ.22 వేల కోట్లకు చేరాయని తెలిపారు. ప్రాజెక్టు ఆలస్యం కావటంతోపాటు కోవిడ్ ప్రభావంతో మెట్రో ప్రాజెక్టును చేపట్టిన ఎల్ అండ్ టీ కంపెనీ నష్టాల్లో కూరుకుపోయిందని వివరించారు. మరోవైపు పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని సీఎం విమర్శించారు. బీఆర్ ఎస్ నేతలు తమ ఆస్తులు పెంచుకునేందుకు తప్ప ప్రజల కోసం ఆలోచించలేదని దుయ్యబట్టారు. దీంతో ఢిల్లీ తర్వాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో ఆ తర్వాత తొమ్మిదో స్థానానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెట్రో విస్తరణకు నిర్ణయం తీసుకుందన్నారు. ఆ మేరకు ఫేజ్ -2 కోసం ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తిచేశామని గుర్తు చేశారు. అయితే ఫేజ్-1 ను నిర్మాణాన్ని చేపట్టిన ఎల్ అండ్ టీ తోనే ఫేజ్ -2ను నిర్మించాల్సి ఉంటుందని కేంద్రం నిబంధన పెట్టిందనీ, దీనికి ఎల్ అండ్ టీ అంగీకరించలేదని తెలిపారు.

గత నష్టాలతోనే సతమతమవుతున్న తమకు ఫేజ్ -2 నిర్మించడం కష్టమంటూ ఆ సంస్థ తేల్చి చెప్పిందన్నారు. రూ.30 వేల కోట్ల ఆస్తి సృష్టించినా ఏటా 400 కోట్లు నష్టం వస్తుందంటూ ఆ సంస్థ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అందుకే ఫేజ్ -2 నిర్మాణంలో భాగస్వామ్యం కాబోమని వారు స్పష్టంగా చెప్పారని పేర్కొన్నారు. భవిష్యత్ లో ప్రాజెక్టు నిర్వహణకు కూడా ఒప్పుకోమంటూ ఆ సంస్థ తిరస్కరించిందని వివరించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు, సమాలోచనలు జరిపామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ఒక్కటే దీనికి ఏకైక పరిష్కారంటూ కేంద్రం స్పష్టం చేసిందన్నారు. దీంతో రూ.30 వేల కోట్ల ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తిని 15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఇందుకోసం 8.25 శాతం వడ్డీకి 13,600 కోట్లను ఎల్ అండ్ టీ మెట్రోపై రుణం తెచ్చుకుందన్నారు. ఆ లోన్ ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఐ.ఆర్.ఎఫ్.సీ ద్వారా తక్కువ వడ్డీకి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకోవడానికి వెసులుబాటు కల్పించాలంటూ కోరామని చెప్పారు. గతంలో బీఆర్ ఎస్ సర్కారుకు పీ.ఎఫ్.సీ, ఆర్.ఈ.సీ ద్వారా పదేండ్లలో రూ.3.15 లక్షల కోట్లను ఎలాంటి గ్యారెంటీ లేకుండా, మూడో కంటికి తెలియకుండా కేంద్రం అప్పుగా ఇప్పించిందని వివరించారు. అప్పుడు 9 నుంచి 11.5 శాతం కేసీఆర్ అప్పులు తెచ్చారని గుర్తు చేశారు. కానీ తమ ప్రభుత్వం మాత్రం ఐ.ఆర్.ఎఫ్.సీని ఒప్పించి మరీ నాలుగు శాతం వడ్డీకి జపాన్ సంస్థ ద్వారా రూ.13,600 కోట్లను అప్పుగా తీసుకున్నామని వివరించారు. ఇది ఐ.ఆర్.ఎఫ్.సీ. నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బాకీ ఉన్న రూ.1,400 కోట్లను కూడా చెల్లించామని స్పష్టం చేశారు. ఇక లోన్ వచ్చినట్టే అని భావిస్తున్న తరుణంలో కిషన్ రెడ్డి దాన్ని అడ్డుకున్నారంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 20న ఆయన కేంద్రమంత్రి ఖట్టర్‌ను, 21న అశ్వినీ వైష్ణవ్ ను కలిసి లోన్ ఇవ్వొద్దంటూ చెప్పారని విమర్శించారు. ఈ విషయం తెలిసిన తర్వాతే తాము కిషన్ రెడ్డి వెంట పడుతున్నామని స్పష్టం చేశారు. వాస్తవానికి ఫేజ్-2కు సంబంధించి సోమవారమే నిధులు విడుదల కావాల్సి ఉందని, కానీ కిషన్ రెడ్డి అడ్డుపడటం వల్ల అవి ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వాటిని ఇప్పించాల్సిన బాధ్యత ఆయనదేనని అన్నారు. ఒకవేళ ఫేజ్-2లో కేంద్రం భాగస్వామ్యం కావటం కష్టమనుకుంటే ఆ 50 శాతం వాటా అవసరం లేకుండా తమ ప్రభుత్వమే దాన్ని భరించి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ ఎంపీగా ఉండి, తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డే ఫేజ్-2కు ఎన్.వో.సీ. ఇప్పించాలని సీఎం డిమాండ్ చేశారు. ఫేజ్-2 చేపట్టబోయే ప్రాంతానికంతా బీజేపీ ఎంపీలు, బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తు చేశారు. అందువల్ల అది పూర్తయితే వారి నియోజకవర్గాల్లోని ప్రజలకే మేలు కలుగుతుందని చెప్పుకొచ్చారు. అయినా కిషన్ రెడ్డి ఎందుకు బాధ్యత తీసుకోవటం లేదని ప్రశ్నించారు.

వరంగల్ ఎయిర్ పోర్టు పనుల్లో వేగం పుంజుకోగానే కిషన్ రెడ్డి వెళ్లి.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిశారు.. దాంతో ఆ పనులు మందగించాయని సీఎం పేర్కొన్నారు. ఇదే తరహాలో జపాన్ సంస్థ ఇప్పటికే నిధులను ఐ.ఆర్.ఎఫ్.సీకి విడుదల చేసింది.. కానీ అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ డబ్బులకు వడ్డీ ఎవరు కట్టాలని కిషన్ రెడ్డిని ప్రశ్నించారు.

రిజర్వు బ్యాంకును ఒప్పించిన లెటర్ కూడా తీసుకెళ్లి కేంద్రానికి ఇచ్చామని, అయినా అయినా లోన్ రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీనిపై కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుంటారా లేదా? అని నిలదీశారు. తీసుకోకపోతే ఎన్.వో.సీ. ఇచ్చి మీ భాగస్వామ్యం వదులుకుంటారా? అని ప్రశ్నించారు. అలా చేస్తే తమ ప్రభుత్వమే మెట్రో ఫేజ్-2ను పూర్తి చేస్తుందని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ అహ్మదాబాద్, ఉత్తర ప్రదేశ్, వైజాగ్ కు కూడా మెట్రోను మంజూరు చేసిందని, కానీ తెలంగాణ పట్ల వివక్షను ప్రదర్శి స్తోందని విమర్శించారు. రాజకీయాల కోసం తాను మాట్లాడటంలేదని, మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకొని, మెట్రో ఫేజ్ 2 ను పూర్తి చేసుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

# సింగపూర్ ప్రధానితో సీఎం చంద్రబాబు భేటి

పోర్టులు- ఎయిర్ పోర్టుల అభివృద్ధితో పాటు వివిధ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ-సింగపూర్‌లు కలిసి పనిచేయాలని కోరారు. ఇరువురు నేతల మధ్య జరిగిన చర్చల్లో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణాల గురించి సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్న నిర్మాణాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణాల గురించి వివరించిన సీఎం చంద్రబాబు... అమరావతి అత్యంత నివాసయోగ్యమైన నగరాల సరసన చేరనుందని తెలిపారు. ఏపీలో ప్రజారోగ్యానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి ముఖ్యమంత్రి వివరించారు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసే దిశగా ఏపీ ముందుకు వెళుతుందని సింగపూర్ ప్రధానికి తెలిపారు. అనంతరం ప్రపంచ వ్యాప్తంగా జనాభా తగ్గుదల అంశంపై ఇరువురు నేతలు కొద్ది సేపు చర్చించుకున్నారు. అందుబాటులో గృహ నిర్మాణం, శిశువులు, చిన్నారుల సంరక్షణ లాంటి చర్యలపై నేతల మధ్య చర్చ చోటు చేసుకుంది. సేవల రంగం తరహాలోనే తయారీ, సప్లై చైన్ రంగాలు కూడా భారత్‌లో విస్తృతం అవుతాయని ఇరువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### ఏపీలో భూ లభ్యత- మానవ వనరులు

సింగపూర్ ప్రధానితో భేటీ అనంతరం సీఎం చంద్రబాబు ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ - సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలపై ఇరువురు మధ్య చర్చ జరిగింది. ఏపీ-సింగపూర్ మధ్య విమాన సర్వీసులు, వివిధ విమానాశ్రయాలకు ఎయిర్ కనెక్టివిటీపై చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రికి సీఎం వివరించారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ ఏపీ అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తోందని తెలియచేశారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమి లభ్యతతో పాటు సేవల రంగంలో నిపుణులైన మానవ వనరులు ఏపీలో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ కీలకంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు, సరకు రవాణాకు పోర్టులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో పాటు ఇంటర్నెట్ సహా డేటా సేవల కోసం సబ్ సీ కేబుల్‌ను ఏపీ నుంచి ప్రపంచానికి కనెక్ట్ చేస్తున్నారని తెలిపారు. అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని..ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రపంచ దిగ్గజ స్టీల్ తయారీ సంస్థ ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఏపీ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.



# 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు

71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా తన 'పెద్దన్న'ను (మోదీ) ఒప్పించలేకపోవడం ఆయన చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తోందన్న భయంతోనే రేవంత్ రెడ్డి బీజేపీతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే మెట్రో విస్తరణను నిరాకరిస్తున్న ప్రధానిని, కేంద్రాన్ని విమర్శించే ధైర్యం, దమ్ము ఆయనకు లేవని అన్నారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తే, ఈ అసమర్థ పాలనలో అన్నీ నిలిచిపోయాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో తనను 'చెప్పుల దొంగ'లా చూస్తున్నారని రేవంత్ రెడ్డే స్వయంగా చెప్పడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ అన్నారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును సాధించడంలో విఫలమైనందుకు సీఎం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 'మినీ ఇండియా' లాంటి హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించారు.

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..

పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు. యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# సీజేపీ వ్యవస్థాపకుడిపై దాడి

చేపట్టింది. ఈ ఆందోళనలో పాల్గొన్న అభిజిత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. అతని చెంపపై కొట్టారు. అభిజీత్‌ను కొట్టిన వ్యక్తులపై సీజేపీ కార్యకర్తలు మూకుమ్మడి దాడి చేశారు. ఏం జరిగింది..?

కాక్రోచ్ జనతా పార్టీ జైపూర్ లో నీట్ పేపర్ లీకేజీ, నిరుద్యోగం మొదలైన సమస్యలపై నిరసన తెలపడానికి పిలుపునిచ్చింది. సోమవారం షహీద్ స్మారకం వద్దకు భారీ సంఖ్యలో యువతీయువకులు తరలివచ్చారు. ఆ సమయంలో కొందరు వ్యక్తులు అభిజీత్ దీప్కేపై దాడికి పాల్పడ్డారు. ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న వివరాల ప్రకారం, దీప్కే నిరసన జరుగుతున్న స్థలానికి చేరుకోగానే, మద్దతుదారులు ఆయనను తమ భుజాలపైకి ఎత్తుకున్నారు. అదే సమయంలో గుంపులో ఉన్న కొందరు యువకులు ఒక్కసారిగా ఆయనపైకి దూసుకొచ్చి చెంపదెబ్బలు కొట్టారు. దీనితో దీప్కే మద్దతుదారులు సదరు నిందితులను పట్టుకొని, వారిపై ఎదురుదాడి చేశారు. దీనితో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత నిరసనకారులు అవినీతికి, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ, ఈ సమస్యలపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అయితే శాంతంగా ఉండాలని దీప్కే కార్యకర్తలకు సూచించారు.

## రామాయణంపై వ్యాఖ్య..
# నటుడు ప్రకాశ్ రాజ్‌పై తిరుపతి కోర్టులో ఫిర్యాదు

దండయాత్ర చేశారని, ఇది ఆర్యుల-ద్రావిడుల విభజనను ప్రోత్సహించేలా ఉందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించినట్లు భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధంగా ఉండటమే కాకుండా, ఉద్దేశపూర్వకంగా మతపరమైన విశ్వాసాలను కించపరిచేలా మరియు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో వివరించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023లోని సెక్షన్ 299, 196 కింద కేసు నమోదు చేసి, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ప్రకాశ్ రాజ్ మాట్లాడిన వీడియో ఏప్రిల్ 17న తన దృష్టికి వచ్చిందని భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. రామాయణం, శ్రీరాముడు, లక్ష్మణుడి గురించి ఆయన మాట్లాడిన తీరు అత్యంత అభ్యంతరకరంగా ఉందని తెలిపారు. సమాజంలో విద్వేషాలు రగిల్చేలా, హిందూ దేవతలను మరియు పవిత్ర గ్రంథాలను నిందితుడు ఉద్దేశపూర్వకంగా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రకాశ్ రాజ్ చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో ఏప్రిల్‌లోనే భానుప్రకాశ్ రెడ్డి ఆయనకు లీగల్ నోటీసులు పంపారు. తన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. తాజాగా ఆయన చేసిన ఫిర్యాదును తిరుపతి కోర్టు విచారణకు స్వీకరించింది.

## బద్రీనాథ్ క్షేత్రానికి ముఖేశ్ అంబానీ కళ్లు చెదిరే విరాళం

లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన.. బద్రీనాథ్ - కేదార్‌నాథ్ ఆలయాల అభివృద్ధి, భక్తులకు మౌలిక వసతుల కల్పన కోసం రూ. 10 కోట్ల విరాళాన్ని అందజేశారు. సోమవారం ఉదయం హెలికాప్టర్‌లో బద్రీనాథ్ ధామ్‌కు చేరుకున్న ముఖేశ్ అంబానీకి బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (దీఖుజ) అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన బద్రీ విశాల్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కేదార్‌నాథ్ క్షేత్రాన్ని కూడా సందర్శించి ప్రార్థనలు చేశారు. అంబానీ అందించిన విరాళాన్ని ఆలయాల అభివృద్ధి పనులకు, యాత్రికుల సౌకర్యార్థం మెరుగైన వసతుల కల్పనకు వినియోగించనున్నట్లు బీకేటీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సోహన్ సింగ్ రాణా వెల్లడించారు. ముఖేశ్ అంబానీ ఈ పుణ్యక్షేత్రాలను క్రమం తప్పకుండా సందర్శించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం చార్‌ధామ్ యాత్ర కొనసాగుతుండగా, శీతాకాలంలో ఆలయాల మూసివేతకు ముందు ఆయన ఈ పర్యటన చేపట్టడం విశేషం. ఈ ఏడాది యాత్రకు భక్తుల తాకిడి రికార్డు స్థాయిలో ఉంది. ఇప్పటివరకు కేదార్‌నాథ్‌ను 12 లక్షల మంది, బద్రీనాథ్‌ను సుమారు 11 లక్షల మంది యాత్రికులు దర్శించుకున్నారు.

## ఎయిరిండియాలో క్లీనింగ్ కార్మికుడు..
# కానీ తన మాటలతో ఇంటర్నెట్ హీరో అయ్యాడు!

వివరాల్లోకి వెళితే, వర్ష అనే ఇన్?స్టాగ్రామ్ యూజర్ తన ప్రయాణ సమయంలో ఎయిరిండియా క్లీనింగ్ సిబ్బందిలో ఒకరిని కలిశారు. ఆమె అతనితో మాటలు కలుపగా, "ఎయిరిండియాలో చేరాలన్నదే నా జీవితాశయం" అని అతడు ఎంతో గర్వంగా, ఉత్సాహంగా సమాధానమిచ్చాడు. అంతేకాదు, "ఏదీ సులభంగా రాదు.. కానీ ఏదైనా సాధ్యమే" అంటూ తన జీవిత దృక్పథాన్ని బలంగా వినిపించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ఆమె వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తన సహోద్యోగులతో పాటు క్యాబిన్ సిబ్బంది పట్ల కూడా అతడు ఎంతో గౌరవం చూపించడం ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. తన తోటి వారి పనితీరును కూడా ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు ఆ ఉద్యోగి నిరాడంబరతకు, ఆయనలోని సానుకూల దృక్పథానికి ముగ్ధులవుతున్నారు. "సార్, మీరు ఆప్యాయమైన ఆలింగనానికి అర్హులు", "పుస్తకం అట్టను చూసి లోపలి సారాన్ని అంచనా వేయకూడదు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏ వృత్తిలోనైనా గౌరవం, ఒక ఆశయం ఉంటాయని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. "యాదృచ్ఛికంగా నేను ఒక క్లీనింగ్ సిబ్బందిని కలిశాను. అతని మాటల్లో అపారమైన ఆత్మవిశ్వాసం కనిపించింది.

# కరోనా కష్టకాలంలో ప్రాణాలర్పించారు..
# నేడు నడిరోడ్డున పడ్డారు.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గత 20 ఏళ్లుగా, ముఖ్యంగా కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన 13 మంది పేద




మహిళా శానిటేషన్ కార్మికులను 'పద్మావతి మెడికల్ ఏజెన్సీ' అన్యాయంగా విధుల్లోంచి తొలగించింది. కేవలం 50 ఏళ్లు నిండాయనే నెపంతో తమ పొట్ట కొట్టొద్దంటూ ఆ తల్లులు జిల్లా కేంద్రంలో ఉధృత న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ నిరసనలో ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఒ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుశీలమ్మ, శ్రీనివాసులు మాట్లాడుతూ.. బాధితులకు రావలసిన 7 నెలల బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి ఏఐటీయూసీ జిల్లా నాయకులు మురళీధర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బాధిత కార్మికులు సరస్వతి, వెంకటేశ్వరమ్మ, సునీత, లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, వెంకటలక్ష్మమ్మ, రవణమ్మ, తులశమ్మ, సులోచన, హరిప్రియ, నాగేంద్రమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

# కర్నూలు విజయోత్సవ సభలో హోలగుంద టీడీపీ శ్రేణుల సందడి

**ఈబీజీ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు**





హోళగుంద పల్లె వెలుగు జూన్ 15 కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కర్నూలులో నిర్వహించిన విజయోత్సవ సభలో హోలగుంద మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు, మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కర్నూలుకు తరలివెళ్లారు. కర్నూలు కన్వెన్షన్ సెంటర్‌లోని బైరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో పాల్గొన్న వారు కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు తమ మద్దతును తెలియజేసిన హోలగుంద టీడీపీ శ్రేణులు, సభ విజయవంతం కావడంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమావాస్య పూజలు

- దేవరగట్టులో భక్తుల రద్దీ
- శ్రీ పోతలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



హోళగుంద పల్లె వెలుగు జూన్ 15 అమావాస్య సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవరగట్టు భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ మళమల్లేశ్వర స్వామి మరియు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ మళమల్లేశ్వర స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, బండారు అర్చనలను నిర్వహించగా, అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గిరి స్వామి, మనోహర్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. అమావాస్య సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. అదే విధంగా గజ్జహళ్లి గ్రామంలో ఉన్న శ్రీ పోతులింగేశ్వర స్వామి దేవాలయంలో కూడా అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ పూజారి శినప్ప తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# నంద్యాల జిల్లాలో గిరిజన విభాగం విస్తృత స్థాయి సమావేశం.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం విస్తృత స్థాయి సమావేశానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి , ఎమ్మెల్సీ ఇసాక్ బాషా , ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి , నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుండా సురేంద్రతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ "ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావిస్తూ, ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో పనిచేసిన పార్టీ వైఎస్సార్సీపీ అని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా గుర్తుచేశారు. బడుగు, బలహీన, గిరిజన, మైనార్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమం, విద్య, ఆరోగ్యం రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. విద్య అనేది జీవితాలను మార్చే శక్తి అని నమ్మిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్య, సంక్షేమం కోసం వైఎస్సార్సీపీ నిరంతరం కృషి చేసిందని గుర్తుచేశారు. త్వరలో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్సీపీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం తిరిగి ఏర్పడిన అనంతరం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తూ, వారికి ఇంకా ఎక్కువ అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# ఆర్టిఈ విద్యాహక్కు చట్టం ను సమగ్రంగా అమలు చేయాలి . యు ఎస్ ఎఫ్ ఐ.

**నారాయణ ,శ్రీ చైతన్య, భాష్యం కార్పోరేట్ శక్తుల ఫీజుల దోపిడీ పై చర్యలు తీసుకోవాలి.**

**ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి.**





పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాహక్కు చట్టం 2009 ను సమగ్రంగా అమలు చేయాలని చట్టం ప్రకారం 25% ఉచిత సీట్లల ద్వారా చదువుతున్న విద్యార్థుల నుంచి ప్రవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయటాన్ని ఖండిస్తూ యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధక్షులు నరసింహ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజకుమారి కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి వారు మాట్లాడుతూ 25% ఉచిత సీట్లకు గాను రాష్ట్ర సమగ్ర శిక్ష నుంచి అన్ని ప్రైవేటు పాఠశాలలకు బకాయిలు ఉన్న నిధులను విడుదల చేసిన ప్రవేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై అధిక భారాలు మోపుతూ ప్రైవేటు పాఠశాలలు ఫీజు లు వసూలు చేసిన వారి పై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని తక్షణమే ఈ ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు ఉచిత సీట్లపై అవగాహన కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు పత్రికా ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు . ప్రైవేట్ స్కూల్ ల ఫీజు నియంత్రణ చట్టం చేయాలని నారాయణ శ్రీ చైతన్య భాష్యం మరియు ఇతర కార్పోరేట్ శక్తులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రెనివల్ ,పుస్తకాల పేరుతో, యూనిఫాంలో పేరుతో అనధికారికంగా అధిక భారాలు మోపుతూ ఫీజులు వసూలు చేస్తున్నారు అన్నారు. ఇది విద్యాశాఖ అధికారులకు బహిర్గతంగా తెలిసిన ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు . ప్రభుత్వం తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా విద్యాహక్కు చట్టం 2009 ను అమలు చేయాలని రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని భారత ఐక్య విద్యార్థి సమాఖ్య గా డిమాండ్ చేస్తున్నాము అని తెలిపారు.

# విద్యార్థులు నైతిక విలువలు ఆపాదించుకున్నప్పుడే ఉత్తమ పౌరులుగా రాణించగలరు

**- ఎస్ఐఒ జాతీయ ప్రధాన కార్యదర్శి డా. అనీస్సుర్ రెహమాన్.**







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు ఆపాదించుకున్నప్పుడే తమ కుటుంబానికి, సమాజానికి తద్వారా దేశానికి ఉత్తమ పౌరులుగా సేవలందించ గలరని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డా. అనీస్ ఉర్ రెహమాన్ ఉద్ఘాటించారు. సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా ఆయన నంద్యాల యూనిట్ సందర్శించారు.

ఈ సందర్భంగా నంద్యాల అంటి కోట మస్జిద్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతు నేటి సాంకేతిక పరిజ్ఞానం ఎంత ప్రయోజకరమో అంతా ప్రమాదకరం అన్నారు. విద్యార్థులు చాల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. హాఫిజ్ షోయబ్ జమా విద్యార్థులు నైతిక విలువలు వివరించారు. జమాఆతె ఇస్లామి హింద్ స్థితికి అధ్యక్షులు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ సమాజం పట్ల విద్యార్థులు, యువకులు గురుతర బాధ్యత ఉందని. దేశ ముఖచిత్రాన్ని ఉన్నతంగా భావితరాలకు అందించే వారసులు నేటి విద్యార్థులే అని , వారిని చెడు రుగ్మతలకు దూరంగా ఉంచటంలో తల్లితండ్రుల, ఉపాధ్యాయులు పాత్ర కిందకు అన్నారు. సమావేశానికి అధ్యాయం వహించిన రాష్ట్ర ఎస్ఐఒ అధ్యక్షులు అమీర్ ఫహద్ దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉన్నత విద్య ఆర్జిస్తూనే సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్ది ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హాఫీజ్,రీజనల్ ఆర్గనైజర్ ఆదిల్ ఖాన్ ఉమ్రి, స్థానిక యూనిట్ నాయకులు ఇందాదుల్లా, అబ్దుల్లా, ఖాజా, డా. ఫుర్ఖాన్ నదీమ్, జకరియా, అబ్బాస్ అలీ, షఫీ, ఫయాజ్, అలీం తదితరులు పెరెంట్స్, విద్యార్థులు హాజరయ్యారు.

# ఓ మనిషి కాలాన్ని గెలిచేయ్

పల్లె వెలుగు: ఓ మనిషి..! గతాన్ని తలవద్దు, భవిష్యత్తును ఊహించి ఆందోళన పడొద్దు. నీ జీవితం సుఖదుఃఖాల వలయం. నిన్నటి గాయాల నీడను విడిచిపెట్టు. గడిచిన కాలం తిరిగి రాదు. గతాన్ని తలచి కన్నీరు పెట్టకు. నిన్నటి తప్పులు నిన్ను వెంటాడినా, కన్నీళ్లతో కాలాన్ని వృథా చేయకు. రేపటి గురించి చింతించకు. భవిష్యత్తును ఊహించి భయపడకు. చెప్పుడు మాటలు విని చెడిపోకు. చెల్లని రూపాయికి గీతలు ఎక్కువ, చేతగానివానికి మాటలు ఎక్కువ. రానున్న కష్టాల గురించి ఇప్పుడే ఏడవకు. ఊహాలోకంలో తేలిపోకు. పోలికల పోకడలకు పోకు. ఈర్ష్య, ద్వేషాలను వదులుకో. ఆందోళనల సుడిగుండంలో చిక్కుకుని బుర్ర పాడుచేసుకోకు. మనశ్శాంతిని చేజేతులా దూరం చేసుకోకు. ఈ క్షణమే నీ చేతిలో ఉన్నది. ఈ క్షణమే నీకు బలాన్ని ఇస్తుంది. ప్రస్తుత కాలమే నీ జీవిత గమ్యాన్ని నిర్ణయిస్తుంది. కష్టాలు వచ్చినా ఎదురొడ్డి నిలబడు. చిరునవ్వుతో అడుగు ముందుకు వేయి. భయాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగాలి. ధైర్యంగా నిలిస్తేనే సరికొత్త చరిత్ర సృష్టిస్తావు. ఈ నిమిషాన్ని సంతోషంగా మార్చుకో. గతాన్ని మరచిపో. భవిష్యత్తును వదిలేయి. వర్తమానంలోనే నీ జీవితాన్ని గెలిచేయ్.



గతం ఒక జ్ఞాపకం, భవిష్యత్తు ఒక ఊహ. ప్రస్తుత క్షణంలో జీవించడమే మనిషి పరమార్థం కావాలి. మార్పులేని గతాన్ని గురించి తలచుకుంటూ బాధపడేకంటే, భవిష్యత్తును ఊహించి ఆందోళన చెందక, ప్రస్తుత క్షణంలో జీవిస్తూ ముందున్న పనిపై దృష్టి పెడితే ఒత్తిళ్లు దూరమవుతాయి. విజయాలు సొంతమవుతాయి. -- నేదునూరి కనకయ్య అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, కరీంనగర్.

# వర్షాకాలంలో విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలి: ఏఈ ఓబులమ్మ

హోళగుంద పల్లె వెలుగు జూన్ 15 వర్షాకాలం ఏర్పడే అవకాశం ఉంటుందని, అలాంటి



ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు, రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ ఓబులమ్మ సూచించారు. మండలంలో ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నా లేదా చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు సమయంలో ప్రజలు ఆందోళన చెందకుండా కొంత సమయం వేచి ఉండాలని తెలిపారు. విద్యుత్ సిబ్బంది లోపాలను గుర్తించి వీలైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరిస్తారని పేర్కొన్నారు. ఇళ్లలో ఉపయోగించే హీటర్లు, వాషింగ్ మెషీన్లు, నీటి మోటార్లు, ఫ్రిజ్‌లు వంటి విద్యుత్ పరికరాలను తడి చేతులతో ముట్టుకోవద్దని హెచ్చరించారు. ప్లగ్‌లను ఆన్, ఆఫ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ షాక్‌లకు గురికాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు హొళగుంద సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు 8712480425, నేరనికి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు 8712625781, కోగిలతోట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు 8712037015 నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. గ్రామానికి కేటాయించిన లైన్‌మెన్‌ను నేరుగా సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఆయా గ్రామాల లైన్‌మెన్‌ల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన జాబ్ చార్ట్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. సంబంధిత సిబ్బందికి సమాచారం అందిస్తే సమస్యల పరిష్కారం త్వరగా జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రజల సహకారంతో మండలంలో నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ కృషి చేస్తోందని ఏఈ ఓబులమ్మ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది మౌనేశాచారి, ఉలుగప్ప పాల్గొన్నారు.

# జూన్ 17న టిక్కే మార్కెట్ యార్డులో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" భారీ కార్యక్రమం.

**జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి.**

- ☛సంక్షేమ ఫలితాలను ప్రతిబింబించేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలి.
- ☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాల విజయవంత నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఈ నెల 17న టిక్కే మార్కెట్ యార్డులో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 5 వేల మంది పాల్గొననున్నారని, వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకొని జర్మన్ హ్యాంగర్ పందిళ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. మొత్తం 19 శాఖల స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్టీసీ, డీఆర్‌డీఏ, వ్యవసాయం, మెప్మా, పశుసంవర్ధక శాఖ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, టూరిజం, ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, పోలీసు శాఖ, మత్స్యశాఖ తదితర విభాగాలు తమ శాఖల విజయాలను ప్రజలకు వివరించేలా ప్రదర్శనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీపీఓ ఆధ్వర్యంలో పీ4 కాన్సెప్ట్‌కు సంబంధించిన ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సహకార శాఖ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా పెట్రోల్ బంకులు, జనఔషధి కేంద్రాలు, బియ్యం విక్రయాలు, తేనె, బెల్లం ఉత్పత్తుల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న విధానాన్ని ప్రదర్శించాలని సూచించారు. జలధార కార్యక్రమం కింద కాస్కేడ్ నంబర్-26 పరిధిలో నాలుగు చెరువులను అనుసంధానం చేస్తూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు పొందాయని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేపట్టిన ముఖ్య కార్యక్రమాలు, ఖర్చులు, లబ్ధిదారుల వివరాలను వెంటనే సీపీఓ కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పల్లె పండుగ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, డొక్కా సీతమ్మ, సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర, పింఛన్లు, స్త్రీ శక్తి, డీఆర్‌డీఏ జీవనోపాధి కార్యక్రమాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# వైయస్సార్ నగర్ లో గల టైలర్స్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి.

**స్పందన'లో డిఆర్ఓకు వైయస్సార్ నగర్ మహిళల వినతి.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణ పరిధిలోని వైయస్సార్ నగర్ లో గల టైలర్స్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు అధికారులను ఆశ్రయించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) రాము నాయక్ కు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ.. వైయస్సార్ నగర్ లోని టైలర్స్ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు కనీసం రోడ్లు వేయలేదని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైనే నిలిచిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తీవ్ర దుర్వాసన వస్తోందని, దోమలు చేరి చిన్న పిల్లలు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన చెందారు. వర్షాలు వస్తే మురుగునీరు, వర్షపు నీరు కలిసి ఇళ్లలోకి వస్తోందని, కాలనీలో నడవడానికి కూడా వీల్లేకుండా పోతోందని వివరించారు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేదని, వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని డిఆర్ఓ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కాలనీకి చెందిన మరో మహిళా ప్రతినిధి మాట్లాడుతూ.. గత పది, పదిహేనేళ్లుగా తమ కాలనీ సమస్యలపై మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకులు ఆ తర్వాత తమ మొహం చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సక్రమంగానే మున్సిపల్ పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించాలని, శాశ్వత పరిష్కారం చూపి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీ ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కాలనీకి చెందిన సీనియర్ మహిళా ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. తమ కాలనీ సమస్యలపై స్థానిక కౌన్సిలర్ కు, మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల చిన్న పిల్లలు బడికి వెళ్లాలన్నా, వృద్ధులు బయటకు రావాలన్నా నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తమ కాలనీని నరకకూపం నుండి రక్షించాలని, అంధకారంలో ఉన్న కాలనీకి వీధి దీపాలు వేయించి వెలుగులు నింపాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డిఆర్ఓ రాము నాయక్, త్వరితగతిన మున్సిపల్ అధికారులతో మాట్లాడి టైలర్స్ కాలనీ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కాలనీ మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాధువులకు అడ్డగా మారిన ఆదోని ఎమ్మార్వో ఆఫీస్.



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని ఎమ్మార్వో ఆఫీస్ లో ప్రజలు వారి పనుల కోసం వస్తే కనీసం కూర్చోమని కూడా చెప్పరు అంతేకాకుండా తాగడానికి నీళ్లు కూడా లేని పరిస్థితి ఆదోని ఎమ్మార్వో ఆఫీస్ లో ఉంది ఆఫీస్ రూములో సాధువులకు మాత్రం పరుపులు వేసుకొని నిద్రపోవడానికి మాత్రం విశాలమైన జాగా ఉంది సాధువులు సేద తీర్చుకోవడానికి ఎమ్మార్వో పర్మిషన్ ఇచ్చారా? లేక సాధువులే వచ్చి సేద తీరుతున్నారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది, ఇకపోతే రెవిన్యూ సిబ్బంది ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఏబీవీపీ నంద్యాల జిల్లా కన్వీనర్ గా లక్ష్మీ నరసింహ నియామకం



నంద్యాల రూరల్. జూన్ 15 . (పల్లె వెలుగు ):అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతంలో ప్రాంత శిక్షణ తరగతులు ఘనంగా జరిగాయి.ఆంధ్రప్రదేశ్ ప్రాంత శిక్షణా తరగతుల్లో ఏబీవీపీ నంద్యాల భాగ్ కన్వీనర్ గా ఉన్నటువంటి లక్ష్మీనరసింహను, నంద్యాల జిల్లా కన్వీనర్ గా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నూజిల్ల శ్రీనివాసులు ప్రకటించడం జరిగింది. దీనికి లక్ష్మీనరసింహ స్పందిస్తూ, నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అధ్యక్షులుకి, ఏబీవీపీ రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలియజేశారు.

# తాగి వాహనం నడిపితే జైలుకే.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవ్



తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి ద్విచక్ర వాహనము నడుపుతూ పట్టుబడిన 1. బోయ సాయిరాం తండ్రి పేరు శ్రీనివాసులు శివ శంకర్ నగర్ ఆదోని టౌన్, 2. బి.వి పురుషోత్తం తండ్రి పేరు బివి శ్రీనివాసులు శివ శంకర్ నగర్ ఆదోని టౌన్, 3. బోయ శ్రీనివాసులు తండ్రి పేరు బి గంగాధర్ పర్వతాపురం గ్రామము ఆదోని మండలం చెందిన వ్యక్తిని సెకండ్ క్లాస్ కోర్టు ఆదోని వారి ముందు హాజరు పరచగా మద్యం సేవించిన వ్యక్తులకు ఐదు రోజులు చొప్పున జైలు శిక్ష విధిస్తున్నట్లు టూ టౌన్ సి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

# భూసారం పెంపులో రైతులు శ్రద్ధ వహించాలి

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 15: భూసారాన్ని పెంచడంలో రైతులు శ్రద్ధ వహించి





భూతల్లిని రక్షించుకోవాలని నంద్యాల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు బండి ఆత్మకూరు వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. సోమవారం సంత జుటూరు గ్రామంలో నిర్వహించిన పిఎండిఎస్ సోయం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక రహిత సేంద్రీయ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి పొందడమే కాకుండా నేలలో కర్బన శాతం సూక్ష్మపోషకాలు పెరుగుతాయని అన్నారు. సేంద్రియ ప్రకృతి వ్యవసాయ వరివేయడం నేలకు నత్రజని అందించడం, పిఎండిఎస్ ద్వారా పోషకాలు ఎక్కువగా ఉన్నందున పశువుల మేతగా ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు మిశ్రమ పంటలు వేసుకోవాలని వరిసాగు చేసే పొలంలో జీలుగ, పిల్లి పెసర, ఉలవలు వంటి పచ్చి రొట్ట పంటలు, లేదా పీఎండిఎస్ ప్రీ మాన్సూన్ డ్రైసోయింగ్ వేసుకోవాలని రైతులకు తెలిపారు. బండి ఆత్మకూరు మండలం పూర్తిగా వరి పండించే ప్రాంతం కనుక, వారితోపాటు వరిగడ్డి రైస్ బ్రాన్ ఆయిల్, పశువుల మీదకు డిమాండు ఉన్నందున రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికంగా లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. ఏవో పవన్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ త్వరలో విడుదల చేయనున్నారు కనుక రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఫార్మర్ ఐడి తప్పనిసరిగా పొందాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సీతాఫలం, మునగ, నేరేడు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సునందన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కరీం భాష, మహేంద్ర, హుస్సేన్,శ్రీ కుమార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కృషితో దండు చామంతివిద్యలో రాణింపు

**త్రిబుల్ ఐటీకి ఎంపిక**



దొర్నిపాడు జూన్ 15పల్లె వెలుగు న్యూస్ కృషి ,పట్టుదల, ఏకాగ్రత, ఉంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి నిదర్శనం కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థిని దండు చామంతి ఉపాధ్యాయుల కృషితో విద్యలో రాణించి త్రిబుల్ ఐటీ కి ఎంపికయ్యారు, ఈ సందర్భంగా పాఠశాల ఎస్,ఓ, జయమణి మాట్లాడుతూ మా పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రతి క్లాస్కు 40 మంది బాలికల చొప్పున 200 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారుఅన్నారు అదేవిధంగా రెండవ సంవత్సరం ఇంటర్ లో 20 మంది బాలికలు ఉన్నారన్నారు, పాఠశాలలో మొత్తం 220మంది బాలికలు చదువుతున్నారు, 10వ తరగతి పరీక్షలలో మా పాఠశాల నుండి 37 మంది పరీక్షలు రాయగ 37 మంది పాస్ అయినట్లుఆమె తెలిపారు దండు చామంతి 572 మార్కులు సాధించి ఒంగోలు త్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు ఆమె తెలిపారు, మరో ఇద్దరు బాలికలు త్రిబుల్ ఐటీకి ఎంపిక కావచ్చు అన్నారు మెట్ల జోష్న 565 శివ శ్రావణి 562 మార్కులు రావడంతో వీరికి కూడా రెండవ జాబితాలో సీటు సాధిస్తారని అన్నారు ఉపాధ్యాయుల కృషితో మా పాఠశాల ఉత్తీర్ణత శాతం లో ముందుంది అన్నారు ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నాను అన్నారు

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష.



ఆదోని (పల్లె వెలుగు): ఇస్వి పోలీస్ స్టేషన్ -- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష ఇస్వి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు పట్టుబడిన క్రింది వ్యక్తులను న్యాయస్థానంలో హాజరుపరచగా,అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్, ఆదోని వారు శిక్ష విధించారు.ఎరేష్,చంద్ర, అంజినయ్య పై ముగ్గురు నిందితులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ కావడంతో, న్యాయస్థానం వారికి 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నందున, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇస్వి పోలీసులు సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- రాష్ట్ర కురువ కురుమ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప.**



ఆదోని (పల్లె వెలుగు): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలన ప్రజలకే అంకితం చేశారు.రెండేళ్ల సుపరిపాలన ప్రజలతో పంచుకున్న కర్నూలు జిల్లా కూటమి నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అవడంతో కర్నూలు జిల్లా కూటమి నాయకులు ప్రభుత్వ పథకాలను మరియు అభివృద్ధిని ప్రజలతో పంచుకున్నారు, ఈ సంతోష కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఇన్చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కిష్టమ్మ, ఎమ్మెల్యేలు దస్తగిరి శ్యాంబాబు, జయ నాగేశ్వరరావు, పార్థసారథి, గౌరు చరిత, ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, రాఘవేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మాన్వి దేవేంద్రప్ప, కప్పట్రాల్ బుజ్జమ్మ, మరియు టిడిపి నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు, ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం సక్సెస్ అయింది, అలాగే ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజలకు అందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ప్రజల పార్టీగా నిలిచింది, రెండేళ్లలో ప్రజలు సంతోషంగా ప్రభుత్వాన్ని నమ్ముకుని సంక్షేమ పథకాలను అందుకుంటూ పార్టీకి అండగా నిలిచారు, అలాగే ఇచ్చిన ప్రతి మాట ప్రజలకు సకాలంగా నెరవేరుస్తూ వస్తున్నారు, మన యువగళ నాయకుడు ఐటి మంత్రి వర్యులు లినారా లోకేష్ బాబు ఎంతో శ్రమిస్తూ రాష్ట్రానికి ఎన్నో పెట్టుబడులను తీసుకురావడంలో దేశంలోనే యువ శక్తిగా మారినారు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారు కేవలం ప్రజల కోసమే ప్రజల సంక్షేమ కోసమే కూటమి ప్రభుత్వం నాయకులు పనిచేస్తున్నారు అని ఆనందం ప్రజలతో వ్యక్తం చేసుకున్నారు.

# కోనేరు పనులను పరిశీలించిన గ్రౌండ్ వాటర్ ఏడి రఘురాం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 15 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామంలోని శివనంది ఆలయానికి సంబంధించిన కోనేరు పనులను గ్రౌండ్ వాటర్ ఎడి రఘురాం సోమవారం పరిశీలించారు. ఐదు రోజుల క్రితం కోనేరులో పూడికతీత పనులకు గాను భూమి పూజను నిర్వహించారు. మరమ్మతులకు గాను ప్రభుత్వం తొమ్మిదిన్నర లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగింది. ఏడి రఘురాం తో పాటు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, దోమ పిడి సూర్యనారాయణ, స్పెషల్ ఆఫీసర్ లీలావతి ఏపీ డి సాంబశివరావు, ఏపీవో డాక్టర్ వసుధా రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామ పెద్దలతో పాటు దేవస్థానం చైర్మన్ మద్దిగారి పుష్పరాజ్ తదితరులు హాజరయ్యారు. అంతకుముందు శివ నంది ఆలయంలో అధికారులు పూజలు నిర్వహించారు.

# జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి.

**- రిజిస్ట్రేషన్లు, శిక్షణలు, మ్యాపింగ్ ప్రక్రియలను తక్షణమే పూర్తి చేయాలి.**
**- జిల్లా స్థాయి యోగా పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో యోగాంధ్ర - 2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న అన్ని కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో యోగాంధ్ర కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాంధ్ర యాప్‌లో పౌరుల నమోదు ప్రక్రియలో జిల్లా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు చెందిన సుమారు 4 లక్షల మంది సభ్యులు, ఉపాధి హామీ పథకం కింద రెండున్నర లక్షల మంది ఉపాధి శ్రామికులు, 22 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఏడు వేల మంది ఉపాధ్యాయులు, అలాగే 4,500 మంది స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డు సిబ్బంది ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిని యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక దశలో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం 18వ స్థానానికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న యోగాంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొని యోగా సాధనపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిటిజన్ రిజిస్ట్రేషన్, మెనూ మ్యాపింగ్, యోగా పోటీల నిర్వహణ, ట్రైనర్-టు-సిటిజన్ మ్యాపింగ్, సిటిజన్ ట్రైనింగ్ అనే ఐదు కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, వేదికలు యాప్‌లో నమోదు చేయడం, శిక్షణ పొందుతున్న పౌరుల వివరాలను అప్‌లోడ్ చేయడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మిడ్తూరు, జూపాడుబంగ్లా, ఆత్మకూరు, నందికొట్కూరు మండలాలు మెరుగైన పనితీరు కనబరిచాయని అభినందించారు. మరోవైపు నంద్యాల అర్బన్, బేతంచెర్ల అర్బన్, పగిడ్యాల, ప్యాపిలి, బనగానపల్లి ప్రాంతాల్లో అధిక శాతం పనులు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా నంద్యాల అర్బన్ పరిధిలో లక్ష్యానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరగలేదని పేర్కొంటూ సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

సిటిజన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అత్యంత సులభమని, ఆధార్ నంబర్, ఓటీపీ ధృవీకరణతో పాటు ప్రాథమిక వివరాలు నమోదు చేస్తే సరిపోతుందని కలెక్టర్ వివరించారు. అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతల కోసం జిల్లా స్థాయి పోటీలను మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, పోటీదారులు ఉదయం 8.30 గంటలకల్లా వేదిక వద్దకు చేరుకునేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 113 ఫిర్యాదులు.

**ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించరాదని అధికారులకు ఆదేశాలు..**

**● చట్ట పరిదిలో న్యాయం చేస్తామని ప్రజలకు భరోసా.. ● జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ( 15-06-2026) నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఫిర్యాదిదారుల నుంచి 113 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.

# ఆదోని పాత ఓవర్ బ్రిడ్జికి మరమ్మత్తులు చేయించాలి.

**సిపిఐ సిపిఎం సిపిఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ డిమాండ్**







ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ప్రజలకు ప్రాణాపాయంగా మారిందని సిపిఐ పట్టణ కార్యదర్శి టీ.వీరేష్ సిపిఎం పట్టణ కార్యదర్శి డి లక్ష్మన్న కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్చార్జి దిలీప్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎంకప్ప ఆందోళన వ్యక్తం చేశారు.గత శనివారం కురిసిన భారీ వర్షాల కారణంగా రైల్వే లైన్ పక్కన ఉన్న ఫుట్‌పాత్ గోడ దాదాపు 60 అడుగుల మేర కూలిపోయి, కింద నిర్వహిస్తున్న దుకాణాలపై పడిందన్నారు. ఈ ప్రమాదం తెల్లవారుజామున జరగడంతో అక్కడ ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. ఇదే ఘటన రద్దీ సమయంలో జరిగి ఉంటే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

పాత ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థపై గతంలో అనేకసార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బ్రిడ్జి పరిస్థితి రోజురోజుకూ మరింత ప్రమాదకరంగా మారుతున్నందున ప్రజల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్‌ను కలిసి పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. పాత ఓవర్ బ్రిడ్జి సైడ్ వాల్ తొలగించి మరమ్మత్తు పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

అధికారులు వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె. రమేష్ అంజిత్ గౌడ్ కొత్తూరు ఈరన్న మహిళా సమాఖ్య నాయకురాలు మణిమ్మ సిపిఎం నాయకులు తిప్పన గోపాల్ శ్రీను తదితరులు పాల్గొని హెచ్చరించారు.

# పశ్చిమ ప్రాంతా అభివృద్ధికి సహకరించండి.

**☛ఆదోని జిల్లా సాధన మరియు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం.**



ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఉదయం కర్నూలు జిల్లా అదితి గృహములో రాష్ట్ర జల వనరుల శాఖామాత్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదోని జిల్లా సాధన మరియు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు సాగునీరు మరియు నీటి ప్రాజెక్టుల అంశాలపై నిధులను మంజూరు చేసి వేదవతి ' రాఘవేంద్ర రాఘవేంద్ర గుండ్రేవుల ఆర్డిఎస్ మొదలగు ప్రాజెక్టులకు నగర డోనరిజర్వాయర్ తొందరగా నిధులను మంజూరు చేసి ప్రారంభించవలసినదిగా కోరడమైనది వేదవతి ప్రాజెక్టు పర్యావరణ అనుమతి కోరుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం త్వరలో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని మరొకసారి కర్నూలు జిల్లా ఇన్చార్జి మినిస్టర్ నిమ్మల రామానాయుడు కోరడమైనది ఈరోజు మంత్రి కలసి వినతి పత్రం అందజేసిన వారిలో కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు కృష్ణమ్మ బిజెపి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ బిజెపి సీనియర్ నాయకులు విట్టా రమేష్ ఆదోని జిల్లా సాధన మరియు అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ రఘు రామయ్య ట్రెజరర్ కృష్ణమూర్తి జాయింట్ సెక్రెటరీ కమతం వెంకటేష్ ఈసీ మెంబర్ హనుమంతరావు కలసి వినతి పత్రాన్ని సమర్పించడం అయినది మంత్రి సానుకూలంగా స్పందించడం అయినది.


# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు.

## జడ్పీ జనరల్ బాడీలో లేవనెత్తిన ప్రజా సమస్యలపై శాఖల వారీ సమీక్షలు.

**-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

ఉద్యోగ సంఘాలు, జడ్పీ జనరల్ బాడీ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం, జడ్పీ జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 30 గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు ఉండగా, నంద్యాల జిల్లాలో 15 ఉద్యోగ సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు 126 సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఉద్యోగుల నుంచి ప్రధానంగా సెలవుల మంజూరు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల మంజూరులో జాప్యం, కారుణ్య నియామకాల ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లలో కోతలు, చిన్నచిన్న సెలవులకైనా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న అంశాలను తన దృష్టికి తీసుకువచ్చారని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, మిగిలిన అంశాలను సమావేశ మినిట్స్ రూపంలో రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 17 తర్వాత జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సమీక్ష చేపడతామని కలెక్టర్ తెలిపారు. జడ్పీ జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రజా సమస్యలపై శాఖల వారీ సమీక్షలు నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. దొర్నిపాడు మండల పరిధిలోని పాఠశాలలో ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ శిథిలావస్థకు చేరి విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన విషయం, కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో పాఠశాల అప్‌గ్రేడ్ అయినప్పటికీ విద్యార్థులు చెట్ల కింద చదువుకుంటున్న పరిస్థితిని సంబంధిత అధికారులు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్రాహ్మణకొట్కూరు ప్రాంతంలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యను పరిష్కరించాలని ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో ఆర్టీఎస్ఎస్ పథకం అమలు, గడివేముల ప్రాంతంలో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా, సోమాపురం గ్రామంలో ఇళ్లపైకి వాలుతున్న విద్యుత్ తీగలు, బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు




సోలార్ గీజర్ల ఏర్పాటు వంటి అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి 167కే, 340సీ పనుల సందర్భంగా అనుమతులు లేకుండా మట్టి తరలింపు, పైప్‌లైన్ల ధ్వంసం, బ్రాహ్మణకొట్కూరు సమీపంలో రైతుల వ్యవసాయ భూములకు వెళ్లే దారులు మూసుకుపోవడం వంటి సమస్యలకు పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆత్మకూరు కురుకుంద, బైరప్ప చెరువులకు సంబంధించిన నీటి విడుదల అంశాలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించాలన్నారు. అలాగే ఎస్సీ కమిషన్‌కు సంబంధించిన పెండింగ్ పిటిషన్లు, కొత్తగా వచ్చిన వినతులు సహా అన్ని అంశాలపై శాఖల వారీగా ప్రత్యేక సమీక్షలు నిర్వహించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

# వడ్డెర కుల వృత్తి వారికి పెన్షన్ సౌకర్యం కలుగించాలి

## -రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్



నంద్యాల ప్రతినిధి. జూన్ 15 . (పల్లె వెలుగు ):నంద్యాల పార్లమెంటు సభ్యురాలు లోక్సభ టిడిపి డిప్యూటీ ఫోర్డ్ లీడర్ జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్ పర్సన్ ఎంపీ బైరెడ్డి శబరి కి దివ్య నమస్కారములతో ఆంధ్రప్రదేశ్ నంద్యాల వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చెల్లా వెంకటేష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగుల గోపాలు శివకృష్ణ పలుకూరు నంద్యాల మధు వేణు నంద్యాల సురేష్ యాలూరు సుబ్బలచ్చమ్మ గోవిందపల్లి వెంకటలక్ష్మి జిల్లా నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు శుభ లచ్చమ్మ చర్ల సుబ్బరాయుడు నంద్యాల జిల్లా వడ్డెర సంఘం నాయకులు వల్లపు వెంకటసుబ్బయ్య నంద్యాల సంఘం నాయకులు తదితరులు కలిసి ఎంపీ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. చల్లా వెంకటేష్ గోగుల గోపాల్ శివకృష్ణ పలుకూరు వీరు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన ప్రభుత్వానికి గెలుపొందిన అభ్యర్థులకు మా యొక్క హార్దిక శుభాకాంక్షలుతెలియజేస్తున్నాను. ఈ అఖండ విజయానికి వడ్డెర జాతి కూడా కృషిచేసినందున గౌరపడుతున్నాము ఎన్నికల ముందు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ తీర్మానం మరియు ఇతర ఆశలను బైరెడ్డి శబరిని నంద్యాల జిల్లా సంఘం నాయకులు కలిసి ఐక్యమత్యంతో ఉండి మన సమస్యలను తెలపడం జరిగింది .రాళు కొట్టి అందునీక పరిజ్ఞానం శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో మట్టి సిమెంటు ఇటికలు ఐరన్ ప్లాస్టిక్ వంటి వాటితో నిర్మాణాలు సాగుతూ వస్తున్నాయి. దీంతో వంశపారముగా కుల వృత్తిని జీవనోపాధిగా మార్చుకున్న వడ్డెర సమ్మెటలు మూలన పడడంతో దుస్థితి ఏర్పడింది కుల వృత్తి మూలన పడడంతో క్యారెలీలలో కూలీలుగా వస్తాయి కూలీలుగా రూపతాపరచెందుతారు. పట్టణాలు నగరాలు వలస పోయి భవన నిర్మల కూలీలుగా ఇతరాంతర పనులు చేతులు వంటివి చేస్తున్నాము. కొండలను రోడ్లుగా మొలిసి చేయగల వడ్డెర్ల చేతితో తవ్వకం పనులను వడ్డెర్లకు రిజర్వేషన్ 30శాతం కేటాయించడానికి వడ్డెర సంఘం వడ్డెర భవన నిర్మించేందుకు నంద్యాల జిల్లాలో 650 చదరపు గజాలు కేటాయించడానికి ప్రభుత్వం అంగరించాలని నిరుపేదలైన వడ్డెర్లకు ఇందులేని నిరుపేదలకు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇల్లు కట్టించి వాళ్ళని బంజర భూములలో కుటుంబానికి 10 ఎకరాలు చొప్పున భూమి పంచివాలని కోరుకుంటున్నాము. 50సంవత్సరాలు నిండిన వడ్డెర కుల వృత్తి వారికి పెన్షన్ సౌకర్యం కలుగించాలని,ఐదు సంవత్సరాల అయినా కూడా వడ్డెర ఫెడరేషన్ కు సొసైటీలో ద్వారా 15 మంది గ్రూపుగా ఏర్పాటు చేసుకున్నా కూడా ఆన్లైన్ చేసుకున్నా కూడా రిజిస్ట్రేషన్ చేసినా కూడా ఫెడరేషన్ నుంచి 40 లక్షల కేటాయించాలని 20 లక్షలు సబ్సిడీ తీసివేయాలని కోరారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలి

● కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ● 'ఫిర్యాదుల స్వీకరణ'కు 19 అర్జీలు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో మరింత వేగవంతం పెంచాలని, నిర్దేశిత గడువు చివరి వరకు వేచి ఉండొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజల నుండి 19 ఫిర్యాదులు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఇంచార్జీ సిటి ప్లానర్ వెంకటరమణ, మేనేజర్, ఆర్వో జూనైద్, ఎంఈ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులకు నాణ్యమైన ఎండార్స్మెంట్ అందించాలి.

● పీజీఆర్ఎస్‌లో 408 ప్రజా దరఖాస్తుల స్వీకరణ. ● ప్రజల సంతృప్తే ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి నాణ్యమైన, స్పష్టమైన ఎండార్స్మెంట్ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కార ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తోందన్నారు. అర్జీ స్వీకరణ నుంచి ఎండార్స్మెంట్ జారీ చేసే వరకు ప్రజల సంతృప్తి స్థాయిని ఉన్నతాధికారులు ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకుంటున్నారని తెలిపారు. పాణ్యం తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన 19 ఫోన్ కాల్స్‌లో ప్రజలు వంద శాతం సంతృప్తి వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఎండార్స్మెంట్ అర్జీదారునికి సులభంగా అర్థమయ్యే స్పష్టమైన తెలుగు భాషలో ఉండాలని సూచించారు. అర్జీల పరిష్కారానికి ముందు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, విచారణ నిర్వహించి, అనంతరం సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో వారు అనుసరించాల్సిన న్యాయపరమైన మార్గాలను కూడా వివరించాలని సూచించారు. సీఎంఓ కార్యాలయం నుంచి జిల్లాకు సంబంధించిన పలు అర్జీలను పరిశీలిస్తూ, ఫిర్యాదు స్వరూపం, దానికి అధికారులు ఇచ్చిన ఎండార్స్మెంట్ తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు అవగాహన కల్పించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత పెంచేందుకు అర్జీదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి కోసం ఐగాట్ కర్మయోగి వేదికలో అందుబాటులో ఉన్న కోర్సులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యాలయాల కార్యకలాపాలన్నీ ఈ-తపాల్ ద్వారానే పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారిన ప్రభుత్వ పాఠశాల భవనాలు, హాస్టళ్లు, వైద్యశాలలను గుర్తించి, విద్యార్థులు మరియు ప్రజల భద్రత దృష్ట్యా వాటిని కూల్చివేసేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 944 అర్జీలు పెండింగ్**

వన్ మంత్ - ఫోర్ విజిట్స్' కార్యక్రమంలో భాగంగా గత నెల నాలుగు వారాలపాటు ఆళ్లగడ్డలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 2,074 అర్జీలు స్వీకరించగా, వాటిలో 1,130 అర్జీలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 944 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో రెవెన్యూ శాఖకు చెందిన 494, సర్వే సంబంధిత 177 అర్జీలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను గురువారంలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 242 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా క్షేత్రస్థాయిలో భూ సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 242 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ మరియు గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 42, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఎ భూములకు సంబంధించినవి 19, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 47, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 94, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 34, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 3 దరఖాస్తులు ఉన్నాయని వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ముఖ్య అర్జీలు**

1)డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన జెట్టి మధు, సర్వే నంబర్ 334/1లో తనకు ఉన్న మూడు ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. 2)రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన అక్కల వెంకటరమణ, సర్వే నంబర్ 187లో ఉన్న 2.15 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

# కర్నూలులో టీడీపీ ప్రముఖ నాయకులకు ఘన సన్మానం





హోళగుంద పల్లె వెలుగు జూన్ 15 కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూలులో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద్ గౌడ్, యువ నాయకుడు ఈబీజీ రాజేంద్ర గౌడ్ కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి కె.ఈ. కృష్ణమూర్తి, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ. శ్యాంబాబు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడులను శాలువాలు కప్పి, పూలహారాలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, యువనేత నారా లోకేష్ కృషితో పార్టీకి మరింత బలం చేకూరుతోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పంపతి, యరిస్వామి, డీడీ నాగప్ప, డీడీ వెంకటేష్, రామాంజి, మాలి, గజ్జహల్లి పూజారి రామలింగ



తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నాయకుల ఆశీస్సులు, కార్యకర్తల అంకితభావం, ప్రజల ఆదరణతో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలి

**● సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత ఉండాలి ● రీ ఓపెన్, ఇంప్రాపర్ కేసులను పూర్తిగా తగ్గించాలి ● కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేయాలి ● జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశం**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రజల నుంచి వివిధ సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవ పరిస్థితుల ఆధారంగా న్యాయం చేయాలన్నారు. ముఖ్యంగా పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. 15 రోజుల్లో కారుణ్య నియామకాలు జిల్లాలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని కారుణ్య నియామకాల కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, వాటిని 15 రోజుల్లోగా పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా పారదర్శకంగా, సమయపాలనతో వ్యవహరించి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు వంద శాతం పూర్తి చేయాలి: జేసీ నూరుల్ ఖమర్ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. కొన్ని శాఖలు ఇంకా ఆశించిన స్థాయిలో నమోదు పురోగతి సాధించలేదని పేర్కొంటూ, ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 24న జిల్లాకు ముఖ్యమంత్రి రాక



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 24వ తేదీన కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలోని 'జియో మైసూర్ గోల్డ్ మైన్స్' కంపెనీని ఆయన సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి స్థాయి పర్యటన కావడంతో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 24న జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం, సీఎం చంద్రబాబు నాయుడు ప్లాంట్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పటి నుంచి తిరిగి విజయవాడ బయలుదేరే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

**శాఖల వారీగా కలెక్టర్ ఆదేశాలు:** హెలిపాడ్, రోడ్ల నిర్మాణం: హెలిపాడ్, బహిరంగ సభ ప్రాంగణం, బారికేడింగ్, రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు: నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ట్రాన్స్‌కో అధికారులు, తాగునీరు, తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాటును ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ పర్యవేక్షించాలన్నారు. వైద్య సౌకర్యాలు: మూడు ముఖ్య ప్రాంతాల్లో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, లైవ్ బ్లడ్ డోనర్లతో పాటు కార్డియో, న్యూరో స్పెషలిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్టాళ్లు: సభ ప్రాంగణంలో పిజిఆర్ఎస్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌తో పాటు జలధార–జలహారతి, డిఆర్డిఏ, అగ్రికల్చర్, హార్టికల్చర్, స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర తదితర శాఖలకు సంబంధించిన ఆరు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) వెంకటనారాయణమ్మ, ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, పత్తికొండ ఆర్డీఓ చిన్న ఓబులేసు, వివిధ శాఖల పీడీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి. ఎస్ఐఆర్ అవగాహన సదస్సు.

**గడివేముల మండల తాసిల్దార్ వెంకటరమణ.**



గడివేముల మండల కేంద్రంలో ఓటరు నమోదు పై అవగాహన. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలి. ఎస్ ఐ ఆర్ లో భాగంగా సోమవారం నుండి నుండి వచ్చే నెల 14వ తేదీ వరకు బిఎల్వోలు మీ ఇంటి వద్దకు వచ్చి ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వివరాలు తీసుకుందురు గడివేముల గ్రామం నందలి పోలింగ్ స్టేషన్లో 328, 324,330 ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పర్యవేక్షించడం అయినది. ప్రజలందరూ సహకరించవలసిన దిగా కోరడమైనది.(ఎస్ఐఆర్) అవగాహన సదస్సు నిర్వహించారు. గడివేముల తాసిల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అర్హులైన ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# విజయోత్సవానికి.. కూటమి కదం తొక్కింది

**☛ఆదోని నుంచి భారీగా తరలిన టీడీపీ - జనసేన శ్రేణులు.**



ఆదోని (పల్లె వెలుగు): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న విజయోత్సవ కార్యక్రమానికి ఆదోని నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. తెలుగుదేశం పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లప్ప ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా ప్రజలకు సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమన్వయంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నాయకత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పారు. ఆదోని నియోజకవర్గం నుంచి అన్ని మండలాల నుంచి కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం కూటమిపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనమని నాయకులు అభిప్రాయపడ్డారు. విజయోత్సవ సభను విజయవంతం చేయాలనే సంకల్పంతో పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన కార్యకర్తలు పార్టీ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదోని నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కూటమి ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ తరలింపు కార్యక్రమం నియోజకవర్గంలో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు దోహద పడుతున్నాయని, అదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రజాసేవలో ముందుండాలని నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విజయోత్సవ సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కూటమి శ్రేణులు ఉత్సాహంగా కార్యక్రమ స్థలానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి రేణు వర్మ, గాజుల రాజశేఖర్, ఇంద్రనగర్ జనసేన వార్డు ఇన్చార్జి ఐ సి,రాకేష్, టిడిపి కార్యకర్త బాలు యాదవ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# దద్దరిల్లిన విజయోత్సవ సభ.

**● జిల్లా అధ్యక్షురాలు కృష్ణ ఆధ్వర్యంలో కూటమి విజయోత్సవ సభ విజయవంతం.**


**● ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు.**





ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన కర్నూలులో నిర్వహించిన కూటమి విజయోత్సవ సభ అత్యంత వైభవంగా, విజయవంతంగా జరిగింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభా ప్రాంగణాన్ని నింపివేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సభకు నీటిపారుదల శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అలాగే కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన దిశగా ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబాటుతో ముందుకు సాగుతోందని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని, రానున్న రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిలో కర్నూలు జిల్లా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమం మొత్తం పార్టీ శ్రేణుల ఉత్సాహం, క్రమశిక్షణ, ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయోత్సవ సభను విజయవంతం చేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలందరికీ గుడిసె ఆది కృష్ణమ్మ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

# ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు




బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 15: ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను నిర్వహించడంలో క్రింది స్థాయి సిబ్బంది ఒత్తిడులకు గురవుతూ ఉన్నారు. ఈ ఒత్తిడి కారణంగా అనారోగ్యాలకు గురవుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ కారణంగా సెలవు పెట్టి వెళ్ళిపోతున్న సంఘటనలు బండి ఆత్మకూరు మండలంలో చోటు చేసుకుంటున్నాయి. బండి ఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం విధి నిర్వహణలో ఒత్తిడికి గురై ఈ నెల 11 నుండి నెల రోజులపాటు సెలవులో వెళ్లిపోయారు. ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు తీరిక లేకుండా పోతూ ఉంది. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం, బుధవారం స్వచ్ఛ పథం, ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, శానిటేషన్ కార్యక్రమాల తోపాటు వివిధ సర్వేలలో, కార్యదర్శులు పాల్గొంటున్నారు. ప్రతి నెల వాటర్ టాక్స్ లు, ఇంటి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులకు టార్గెట్లు విధిస్తున్నట్లుగా తెలుస్తోంది. వీటికి తోడు ఈనెల ఏడవ తేదీ నుండి యోగాంధ్ర కార్యక్రమంలో కూడా పాలుపంచుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 21న ప్రపంచ యోగాంధ్ర దినోత్సవం సందర్భంగా ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని ఆదేశాల మేరకు కార్య దర్శిలు ఆ పనిలో కూడా మునిగితేలుతున్నారు. ప్రత్యేకించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే దరఖాస్తులు, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజల నుండి వచ్చే నోటీసులతో కార్యదర్శులు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉన్నారు. పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కారం కానీ నేపథ్యంలో, అధికారులపై సమాచారం చట్టం కింద నోటీసుల ప్రయోగం కార్యదర్శిలలో ఆందోళనను రేకెత్తిస్తూ ఉంది. అయితే చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించడంలో కొందరు కార్యదర్శులు విఫలమవుతూ ఉండటంతో, బాధిత ప్రజలు సమాచార చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ విషయంలో పరిష్కార మార్గాలను ఆలోచించాల్సిన ఉన్నతాధికారులు మౌనం వహిస్తూ ఉండటంతో, కార్యదర్శులు సతమతమవుతూ ఉన్నారు. బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి సమాచార హక్కు చట్టం కింద వచ్చే నోటీసులకు అధికారులు సమాధానం ఇచ్చుకోలేక నలిగిపోతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో కొందరు కార్యదర్శులు తప్పిదాలు చేస్తూ ఉండటంతో అర్జీదారులలో అసహనం వ్యక్తం అవుతూ ఉంది. ఈ నేపథ్యంలో అర్జీదారులు ఏకంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఉండటంతో, వారి చేత కార్యదర్శులు చివాట్లు తినే పరిస్తితులు కూడా నెలకొంటూ ఉన్నాయి. మండలంలో అధిక భాగం సిమెంట్ రోడ్లు అయితే వేశారు కానీ, వాటికి సంబంధించి డ్రైనేజీలు నిర్మించడంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు విఫలమయ్యారు. డ్రైనేజీలు లేని కారణంగా వర్షాకాలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉండటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి సమస్యలతో సతమతమవుతున్నారు. దీనివల్ల ప్రజలు తమ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వీటికి సంబంధించి దరఖాస్తులను అధికంగా అందజేస్తున్నారు. సంత జుటూరులోని ఓ కాలనీలో నెలల తరబడి నుండి ఏర్పడిన సమస్య ను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలం అవుతుంది. అధికారుల మధ్య ఏర్పడిన సమన్వయ లోపం కారణంగా సమస్య నెలల తరబడి నుండి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడంలోనే ఒత్తిడికి గురైన డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం నెల రోజులపాటు సెలవు పై వెళ్లిపోవడం గమనార్హం. మండల పరిషత్ కార్యాలయానికి ఇప్పటికే 18 కి పైగా సమాచారం చట్టం క్రింద అధికారులకు నోటీసులు అందాయి. మండలంలో వచ్చే సమస్యలను పరిష్కరించడంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రధాన పాత్ర వహించాల్సి ఉంటుంది. సెలవు పై వెళ్ళిపోయినా ఆయన స్థానంలో ఇన్చార్జి ఇఓ ఆర్డీగా బండి ఆత్మకూరు కార్యదర్శి అక్బర్ ను సోమవారం నాడు నియమించడం జరిగింది. ప్రస్తుతం కార్యదర్శి హోదాలో విధులు నిర్వహిస్తున్న అక్బర్ కు ఇన్చార్జి హోదాలో పనిచేయడం కష్టంగా మారే పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. కొన్ని గ్రామాలలో రాజకీయ ఒత్తిడిల కారణంగా కార్యదర్శులు పనిచేయలేని పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జీవోను అమలు చేయాలి
- కలెక్టరేట్‌లో ఏపీయూడబ్ల్యూజే (APUWJ) ఆధ్వర్యంలో వినతి
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హామీ



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లల చదువులకు మొత్తం ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరిని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.కొండప్ప, జాతీయ సమితి సభ్యులు ఎన్.వెంకట సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. సమాజంలో నాలుగో స్తంభంగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం శ్రమిస్తున్న జర్నలిస్టుల జీవితాలు ఆర్థికంగా అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు.

యాజమాన్యాల శీతకన్ను.. వివక్ష తగదు పత్రికలు, టీవీ ఛానళ్ల యాజమాన్యాలు ఇచ్చే చాలీచాలని వేతనాలతో జర్నలిస్టులు కుటుంబ పోషణ భారంగా వెళ్లదీస్తున్నారని, పిల్లలకు నాణ్యమైన చదువులు చెప్పించలేని దుస్థితిలో ఉన్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలన్న నిబంధన జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీలు ఇస్తున్నా, కర్నూలు జిల్లాలో మాత్రం కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, అధికారులు శీతకన్ను ప్రదర్శిస్తూ కోర్టులను ఆశ్రయించడం బాధాకరమన్నారు. ఇకనైనా జర్నలిస్టుల పట్ల వివక్ష వీడి, ప్రతి ఏటా ఎలాంటి ఇబ్బంది లేకుండా 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా స్పష్టమైన సర్క్యులర్ జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్:**

జర్నలిస్టుల వినతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సానుకూలంగా స్పందించారు. విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ లభించేలా తప్పకుండా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీకాంత్, మంజు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాష్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్యవర్గ సభ్యులు మధు, నగర నాయకులు మల్లికార్జున, హరికృష్ణ, రమేష్, వీడియో జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్నేహల్, సూరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియలో బీఎల్వోలే కీలకం

**- కర్నూలు నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఓటర్ల ముసాయిదా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ – సర్) ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారుల (బీఎల్వోలు) పాత్ర అత్యంత కీలకమని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా 93వ పోలింగ్ బూత్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో జరుగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరిస్తున్నారో స్వయంగా పరిశీలించి, వివరాలు నమోదు చేసే విధానాన్ని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని, ప్రస్తుత ఓటరు జాబితాను సరిపోల్చి పారదర్శకమైన ముసాయిదా జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, ద్వంద్వ ఓటు హక్కు కలిగిన వారి పేర్లను తొలగించి, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్‌తో పాటు తల్లి, తండ్రి లేదా సమీప బంధువుల ఓటరు గుర్తింపు కార్డు (ఈపిక్) నంబర్లను నమోదు చేయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని వారు భారత ఎన్నికల సంఘం సూచించిన 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవడానికి ఓటర్లు ఫ్ట్రజూం://జశేవతీం.వఐఱ.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించి, "హముతీఎష్ట్ర "శీబతీ చీుఎవ ఱఅ ్ఘుర్ ా×=" ఆప్షన్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, బీఎల్వోలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లో కానాలపల్లె దొంగతనం కేసు ఛేదింపు

**ఐదుగురు నిందితుల అరెస్ట్ -- చోరీ సొత్తు స్వాధీనంలి**



పల్లె వెలుగు -- నంద్యాల క్రైమ్: గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కానాలపల్లె గ్రామంలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు గొలుసుతో పాటు దొంగతనానికి ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 14-06-2026 రాత్రి కానాలపల్లె గ్రామానికి చెందిన మిదుతూరి లక్ష్మీదేవి ఇంటికి తాళం వేసి నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోని పెట్టెలో భద్రపరిచిన బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రైమ్ నెం. 44/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా 15-06-2026న సాంబవరం మెట్ట వద్ద కాశిరెడ్డి నాయన ఆశ్రమం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, తామే దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు.

**అరెస్టయిన నిందితులు:**

1. ఏటూరి నేతాజీ (24) -- కానాలపల్లె గ్రామం, గోస్పాడు మండలం. 2. ధర్మతేజ (24) -- కానాలపల్లె గ్రామం, గోస్పాడు మండలం. 3. ఏటూరి మద్దిగాళ్ల కిరణ్ (19) -- టంగుటూరు గ్రామం, బనగానపల్లె మండలం. 4. నక్కదిన్నె వాసు (24) -- తొగరచేడు గ్రామం, పాణ్యం మండలం. 5. కానాల ప్రశాంత్ (24) -- గుంతనాల గ్రామం, నంద్యాల మండలం.

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

20.700 గ్రాముల బంగారు గొలుసు ఒక ఆటో (ఏపీ39 డబ్ల్యూఎఫ్ 5538) ఒక బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ నిందితులను వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## మిథున సంక్రమణం సందర్భంగా సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు

**స్వామివారికి మహా సౌర అభిషేకం -- లోక కల్యాణార్థం 168వ చండీహోమం**





పల్లె వెలుగు -- కర్నూలు బ్యూరో:కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మిథున సంక్రమణం, అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అవధూత దత్త పీఠాధిపతి పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఆలయంలో ఆధ్యాత్మిక వేడుకలు ఘనంగా జరిగాయి. మిథున సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని శ్రీ ఛాయా ఉషా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారికి మహా సౌర పారాయణ పూర్వకంగా సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ అభిషేకంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమావాస్య సందర్భంగా లోక కల్యాణార్థం 168వ చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవగ్రహ, లక్ష్మీ గణపతి పూజల అనంతరం మూలమంత్ర సహిత చండీహోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

## దేవాలయ మాన్యం భూములకు కౌలు వేలం పాటలు.



రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రమైన రుద్రవరంలో శ్రీ భాస్కర నందీశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ దొర్వి నరసింహ స్వామి దేవస్థానముల మాన్యం భూములకు కౌలుకు బహిరంగ వేలం పాటలు సోమవారం నిర్వహించారు. ఆళ్లగడ్డ గ్రూపు దేవస్థానముల -1 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయి జయచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్స్పెక్టర్ కార్తీక్ సమక్షంలో వేలంపాటలు నిర్వహించగా రైతులు డిపాజిట్లు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. గ్రామంలో వెలసిన శ్రీ భాస్కర నందీశ్వర స్వామి దేవస్థానమునకు చెందిన 9.86 ఎకరాలు, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానమునకు చెందిన 25.19 ఎకరాలు, గ్రామ సమీపాన అటవీ ప్రాంత సమీపంలో వెలసిన శ్రీ దొర్వి నరసింహ స్వామి దేవస్థానమునకు చెందిన 1. 74 ఎకరాలు కలుపుకొని మొత్తం 36.79 ఎకరాలకు వేలంపాటలు నిర్వహించగా రూ 6 లక్షల 4 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. వేలం పాటలో వచ్చిన ఆదాయాన్ని మూడు దేవాలయాల అభివృద్ధితో పాటు పూజా కార్యక్రమాలకు ఆలయ నిర్వహణ సిబ్బందికి జీతాలకు ఖర్చు చేయడం జరుగుతుందని ఈవో తెలిపారు. ఈ వేలం పాటలలో టిడిపి మండల కన్వీనర్ సీనియర్ నాయకుడు ఎల్వి రంగనాయకులు శెట్టి, టిడిపి నాయకులు అల్లడి చంద్రశేఖర్, ఏరువ కృష్ణమూర్తి, దేవదాయ శాఖ సిబ్బంది, రైతులు, పోలీసులు పాల్గొన్నారు.

## సామూహిక మరుగుదొడ్డి స్థలములో నిర్మాణం ఆపాలి.





రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రం రుద్రవరం లోని రజక పేటకు చెందిన మహిళలు తమ కాలనీ సమీపం లోని బహిర్భూమికి వాడుకుంటున్న స్థలంలో హాస్పిటల్ నిర్మాణం చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రుద్రవరం మండల తహశీల్దార్ నాగవీణకు వారు వినతి పత్రం అందజేశారు.

రజక పేటకు చెందిన మహిళలు సుదీర్ఘకాలంగా బహిర్భూమికి వెళ్లేందుకు వాడుకుంటున్న ఖాళీ స్థలాన్ని, హాస్పిటల్ నిర్మాణం కోసం అధికారులు ఎంపిక చేశారు. ఇప్పటికే ఆ స్థలాన్ని జేసీబీ సాయంతో చదును చేయడంతో, తమకు ఇబ్బందులు తప్పవని మహిళలు ఆందోళన చెందుతున్నారు. హాస్పిటల్ నిర్మాణాన్ని వ్యతిరేకించిన గ్రామస్తులు, దానిని వేరొక అనువైన చోట నిర్మించాలని కోరుతున్నారు. బహిర్భూమికి వెళ్లే స్థలం ఆక్రమణకు గురైతే తమకు మరుగుదొడ్ల సమస్య తీవ్రమవుతుందని, కాబట్టి ఆ స్థలంలో తక్షణమే మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించి తమకు సౌకర్యాలు కల్పించాలని తహశీల్దార్‌ను కోరారు.

# అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలి.

- **పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి.**
- **జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), జలధార – జల హారతి, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, వయోజన విద్యాశాఖ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల ప్రాంగణాల్లో చేపట్టాల్సిన మొక్కల పెంపకం కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు మరింత చొరవ చూపి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కేవలం కొంతమంది అధికారుల బాధ్యతగా కాకుండా, అన్ని శాఖలు సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. స్థలం లేకపోవడం, రాతినేలు, ప్రహరీ గోడల సమస్యలు వంటి కారణాలతో పనులను వాయిదా వేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని, అవసరమైన అంచనాలు సిద్ధం చేసి పిట్టింగ్, మొక్కల నాటే కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల వారీగా పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తామని, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి ఉన్నందున జిల్లాలో ఆదర్శప్రాయంగా అమలు చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న 1,629 మంది బీఎల్ఓలకు ఎలాంటి ఇతర విధులు అప్పగించకుండా చూడాలని ఆదేశించారు. బీఎల్ఓలుగా పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఎన్నికల విధులకు పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. జిల్లాలోని సుమారు 14 లక్షల మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను ఫొటోగ్రాఫ్‌లతో సహా డిజిటలైజేషన్ చేయాల్సి





ఉందన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయని, సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అప్పటి వరకు ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి బదిలీలు ఉండవని పేర్కొన్నారు. ఉల్లాస్ 100 రోజుల కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. మ్యాపింగ్ పూర్తి కాని ప్రాంతాల్లో ఏపీఓలు, ఏపీఎంలు, ఇతర సిబ్బంది సహకారంతో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జలధార – జలహారతి కార్యక్రమం కింద జిల్లాలో మొత్తం 2,103 పనులు మంజూరవగా, 1,044 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1,059 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బనగానపల్లి, పాణ్యం, ప్యాపిలి, డోన్, రుద్రవరం మండలాల్లో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో చేపట్టిన ఉత్తమ జల సంరక్షణ కార్యక్రమాన్ని కేస్ స్టడీ లేదా సక్సెస్ స్టోరీ రూపంలో సిద్ధం చేసి అందించాలని వాటర్ రిసోర్స్ ఇంజనీర్లకు సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల జిల్లాలో అమలవుతున్న జలధార కార్యక్రమాన్ని అభినందించిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గత నవంబర్‌లో 3.5 మీటర్లుగా ఉన్న నీటిమట్టాన్ని ఈ ఏడాది నవంబర్ నాటికి కనీసం ఒక మీటరు మేర మెరుగుపరిచే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం.



**రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాల పంపిణీ.**

- ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలి.
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు స్వయం సమృద్ధితో జీవించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డులో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడీఐపీ (ఏ డి ఐ పి) పథకం కింద దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరితో కలిసి కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, వృద్ధులకు చేతికర్రలు తదితర సహాయక పరికరాలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సుమారు 5 వేల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వివిధ సహాయక పరికరాల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు చేరవేసి వారికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు అంశంపై స్పందిస్తూ, 90 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగి పూర్తిగా ఇతరులపై ఆధారపడే వ్యక్తులకు ప్రత్యేక నిబంధనల మేరకు అధిక పెన్షన్ అందజేస్తున్నట్లు వివరించారు. అర్హుల వివరాలను వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.16 కోట్ల నిధులు కేటాయించిందని, మరింత మంది లబ్ధిదారులకు మద్దతు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 24,679 మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.15.26 కోట్ల మేర పెన్షన్లు అందుతున్నాయని, అదనంగా డయాలసిస్ మరియు మంచానికే పరిమితమైన పక్షవాతం బాధితులకు ప్రత్యేకంగా రూ.1.53 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దివ్యాంగులకు సామాజిక భద్రతతో పాటు రవాణా సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం తరహాలోనే దివ్యాంగ శక్తి కార్యక్రమం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలి. జిల్లాలో ఇప్పటివరకు 1.42 లక్షల మంది దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకుని రూ.58.64 లక్షల విలువైన ప్రయాణ సౌకర్యం పొందినట్లు వెల్లడించారు. హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డ్ కార్యాలయాల్లో మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని, సాధారణ వినతిపత్రాలు సమర్పించడం ద్వారా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు, సంబంధిత విభాగాలు పరిశీలించిన అనంతరం తుది అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అలింకో సంస్థ కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ కొనియాడారు. గత మూడు వారాలుగా సంస్థకు చెందిన సిబ్బంది జిల్లాలోనే ఉండి లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా పరికరాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలింకో ద్వారా గుర్తించిన 1,847 మంది దివ్యాంగులకు దాదాపు రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాలను అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులలో ఉన్న ఆత్మవిశ్వాసం, పట్టుదల సమాజానికి ఆదర్శమని, వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తున్న తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

*పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తగిన స్థలం గుర్తించి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, స్థలాల కబ్జా, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని హామీ ఇచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, ఉమ్మడి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాతిమా, ఆర్డిఓ విశ్వనాథ్ మున్సిపల్ కమిషనర్ శేషన్న, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ రవికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.*

## కూటమి రెండేళ్ల పాలన నమ్మకం, అభివృద్ధికి నిదర్శనం

**జిల్లా స్థాయి సభ, మహిళా మార్ట్ సందర్శనలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ**

- ద్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం
- పూచీకత్తు లేకుండా ?10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. సోమవారం కర్నూలు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కూటమి ప్రభుత్వ 'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' జిల్లా స్థాయి సభలో ఆమె ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ



మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో జరిగిన ఈ సభలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత రెండేళ్ల కూటమి పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా సమీక్షించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. 'స్వయం' బ్రాండ్‌తో మహిళల ఆర్థిక ప్రగతి సభ అనంతరం కర్నూల్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో డ్వాక్రా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టులు, సూపర్ మార్కెట్లను కమ్మరి పార్వతమ్మ సందర్శించారు. మహిళలు సహజ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, సేంద్రియ కూరగాయలు, పచ్చళ్లు, అప్పడాలు, మసాలా పొడులను ఆమె పరిశీలించి, వారిని అభినందించారు.

**ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ:-** *"పొదుపు సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా ఉత్పత్తులకు 'స్వయం' అనే ప్రత్యేక బ్రాండ్ పేరును ఖరారు చేసింది. ఈ మార్టుల ద్వారా మహిళలే యజమానులుగా, ఉద్యోగులుగా ఉంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించేందుకు వీలుగా బ్యాంకుల ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా ?10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలను కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మహిళా సాధికారతకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది."*

ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల ప్రతినిధులు, కూటమి ప్రభుత్వ అధికార యంత్రాంగం, మూడు పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కూటమి రెండేళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనం

- కర్నూలు జిల్లా స్థాయి సభలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు కన్వెన్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన కూటమి ప్రభుత్వ 'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కర్నూలు జిల్లా స్థాయి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో జరిగిన ఈ సభకు జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గత రెండేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, నిరుపేదలకు అందిన సంక్షేమ పథకాల పురోగతిపై విస్తృతంగా సమీక్షించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ:** "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. గత రెండేళ్లలో నియోజకవర్గాల వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులను పూర్తి చేయగలిగాం. రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాం."

ఈ సభలో స్థానిక పార్లమెంట్ సభ్యులు (ఎంపీ), సహచర ఎమ్మెల్యేలు, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులతో పాటు తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో బైక్ ఢీకొని ఒకరికి గాయాలు.

రుద్రవరం. పల్లె వెలుగు: మండలంలోని నరసాపురం తిప్పారెడ్డిపల్లి గ్రామాల మధ్య ఆటో బైకు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలు అయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు సోమవారం ఆర్ నాగులవరం గ్రామానికి చెందిన పెద్ద మునిస్వామి నరసాపురం వైపు నుంచి బైక్ పై వస్తుండగా రుద్రవరం వైపు నుంచి వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో పెద్ద మునిస్వామికి గాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం రుద్రవరం 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## విద్యుత్ ఘాతంతో రైతు మృతి



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బోడెద్దుల శివుడు (50) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. సోమవారం స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..తిమ్మాపురం గ్రామ సమీపంలోని పంట పొలంకు వెళ్లగా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తగిలి అపస్మారక స్థితికి వెళ్లారన్నారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



మహానంది, పల్లె వెలుగు రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయలైన ఘటన మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం స్థానికుల వివరాల మేరకు.. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన కిరణ్ బాబు అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తున్నారన్నారు. అదే సమయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో రోడ్డుపై తాబేలు రావడంతో కారు నిలిపివేశారు.కారు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో పక్క నుంచి వెళ్లే సమయంలో కారు డోరు తెరవడంతో తగిలి కింద పడ్డాడని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో యువకుడికి కాళ్ళకి గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు - జిల్లా కలెక్టర్

అమలాపురం, సోమవారం జూన్ 15 :- ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానమని, అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వైకోం నైదియాదేవి, డిఆర్ఓ బి సుబ్బారావుతో కలిసి ప్రజల నుండి 283 అర్జీలను స్వీకరించారు. వచ్చిన ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, దరఖాస్తుదారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. ఏదైనా కారణంతో ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాలను లబ్ధిదారులకు అర్థమయ్యేలా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ వైకోం నైదియాదేవి మాట్లాడుతూ అధికారులు ఫిర్యాదులను స్వయంగా విచారించి శాశ్వత పరిష్కారాలు అందించాలని, మన మిత్ర యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రేషన్, పెన్షన్లు, గ్యాస్ సరఫరా మరియు ఆసుపత్రి సేవలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

# అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా అమావాస్య వేడుకలు

☛భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు
☛భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం
☛ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి మోహన్ ఆధ్వర్యంలో దాతలకు సత్కారం





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరం 32వ వార్డు ముజఫర్ నగర్‌లోని శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అమావాస్య వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి మోహన్ నేతృత్వంలో, దాతలు కె.మంగళ గౌరీ, సి.సాయి సంతోష్, సి.జ్యోతిర్మయి, సి.ఈశాన్ అమృత్ (పైడిపాల గోత్రం) వారి ఆర్థిక సహకారంతో ఈ ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు జరిగాయి.

ఆలయ అర్చకులు విశ్వరూపాచారి స్వామివారికి విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాతల సహకారం అభినందనీయం: దాసరి మోహన్ ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి మోహన్ మాట్లాడుతూ.. అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి పూర్తి విరాళం అందజేసిన కె.మంగళ గౌరి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా దాతల ఉదారత్వంతో ప్రతి నెల అమావాస్య పూజలతో పాటు.. ఏటా శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, ఆలయ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో జరిగే పూజా కార్యక్రమాల్లో కూడా భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

దాతకు ఘన సత్కారం ఆలయ వికాసానికి, అన్నదానానికి సహకరించిన దాత కె.మంగళ గౌరిని ఆలయ కమిటీ బృందం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించింది. కాగా, సోమవారం సాయంత్రం భజన భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తనలు, భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వడ్డె ఆంజనేయులు, వి.విజయ్ కుమార్, వి.నరసింహులు, టి.రామనాగి రెడ్డి, వడ్డె కృష్ణ, వడ్డె చంద్రలతో పాటు 32, 35వ వార్డుల ప్రజలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓర్వకల్లు ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాల తేదీలు మార్పు

● భక్తుల మనోభావాలు, మతసామరస్యానికి పెద్దపీట ● జూలై 1 నుంచి 3వ తేదీ వరకు విగ్రహ, రాజగోపుర కలశ ప్రతిష్ఠలు ● వెల్లడించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఆలయ కమిటీ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు జిల్లా ఓర్వకల్లు గ్రామంలో వెలసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించ తలపెట్టిన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాల తేదీలను మార్చినట్లు పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరితారెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణ అధికారి (ఈవో) ఒక ప్రకటనలో సంయుక్తంగా వెల్లడించారు పూర్వం నిర్ణయించిన ప్రకారం ఈ వేడుకలను జూన్ 22 నుండి జూన్ 24 వరకు నిర్వహించాల్సి ఉంది. అయితే, ఇదే సమయంలో ముస్లిం సోదరుల పవిత్ర 'మొహర్రం' పండుగ వస్తుండటంతో, గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా, ఆదర్శంగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, ఆలయ వాస్తు శాస్త్ర రీత్యా ఉత్తరాయణ కాలంలోనే ఈ శుభకార్యం పూర్తి చేయాలనే సంకల్పంతో వేద పండితులను సంప్రదించారు. పండితుల సూచనలు, భక్తుల మనోభావాల మేరకు సదరు పూజా కార్యక్రమాలను జూలై 1-7-2026 నుండి 3-7-2026 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు స్పష్టం చేశారు.



మూడు రోజుల పాటు ప్రతిష్ఠాపన వేడుకలు: జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఐదంతస్తుల రాజగోపురంపై కలశ ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మరియు శ్రీ గురుత్మంతుని (గరుడుడు) విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు వివిధ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయి. గ్రామ పెద్దలు, ఓర్వకల్లు గ్రామ ప్రజలు, భక్తులు అందరూ ఈ విషయాన్ని గమనించి, మార్చిన తేదీల్లో జరిగే ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఆలయ అధికార యంత్రాంగం పిలుపునిచ్చారు.

# బస్సు సౌకర్యం లేక గజ్జెహళ్లి ప్రజల అవస్థలు

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో బస్సు రాక నిలిచింది.. గ్రామస్తుల ఆవేదన





హోళగుంద పల్లె వెలుగు జూన్ 15 హోలగుంద మండలం గజ్జెహళ్లి గ్రామానికి గత 8 రోజులుగా బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్ఎల్‌సీ డీపీ కాలువ లైనింగ్ పనుల్లో భాగంగా పాత బ్రిడ్జిని పునర్నిర్మించేందుకు బ్రిడ్జి ఇరువైపులా ఉన్న రహదారిని తొలగించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం బ్రిడ్జిపై దారి చాలా ఇరుకుగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు వెళ్లలేకపోతున్నాయి. గజ్జెహళ్లి గ్రామ ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం ఆదోనికి వెళ్లాల్సి ఉంటుంది. గ్రామం నుంచి ఆదోనికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కాగా, ప్రత్యామ్నాయ దారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వృద్ధులు రాకపోకల కోసం ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. సాధారణంగా ఇలాంటి నిర్మాణ పనులు చేపట్టే ముందు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక వంతెన లేదా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు అలాంటి చర్యలు తీసుకోకుండా పాత బ్రిడ్జిని తొలగించి పనులు ప్రారంభించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామానికి బస్సు రాకపోవడంతో పాటు ప్రజల దైనందిన జీవనం అస్తవ్యస్తమైందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాత్కాలిక మార్గం ఏర్పాటు చేసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ

మాజీ ఎమ్మెల్యే గంగుల నాని బేటి





ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 15 పల్లె వెలుగు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని కలిశారు. సోమవారం నాడు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే గంగుల నాని నివాసంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ కలిశారు .ఈ సందర్భంగా నారాయణ రాష్ట్ర రాజకీయాలు తదితర అంశాలపై మాజీ ఎమ్మెల్యే తో చర్చించారు. ఈ సందర్భంగా గత కొన్ని సంవత్సరాల నుండి ఆళ్లగడ్డ రాజకీయ నాయకులతో తనకు సత్సంబంధాలు మంచి స్నేహ బంధాలు ఉన్నాయని నారాయణ తెలిపారు. నాటి రాజకీయాలకు నేటి రాజకీయాలకు చాలా మార్పులు వచ్చాయని అన్నారు.అలాగే తన మిత్రుడు స్వర్గీయ రామకృష్ణారెడ్డి మరణించడం బాధాకరమని మామిద్దరం ఒకే కాలేజీలో చదివామని తెలిపారు. ఈ ప్రాంతానికి వెళ్లేటప్పుడు కచ్చితంగా తన మిత్రుని కలిసి వెళ్లే వాడినని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా ఇంచార్జ్ మంత్రిని కలిసిన కర్నూలు ఎస్పీ.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామా నాయుడు కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ కర్నూలు ప్రభుత్వ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సోమవారం ఇంచార్జ్ మంత్రి ఎస్పీ పూల మొక్కను అందజేశారు.

# గుట్కా, పాన్ మసాలాలపై ఉక్కుపాదం మోపిన శంషాబాద్ పోలీసులు

నిషేధిత పొగాకు ఉత్పత్తుల స్వాధీనం -- ఇద్దరిపై కేసులు నమోదు




రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ -- పల్లె వెలుగు ప్రతినిధి: శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాలమాకుల, కవేలీగూడ, ముచ్చింతల గ్రామాల పరిధిలోని కిరాణా దుకాణాలను సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కవేలీగూడ గ్రామంలోని లిలిఎస్‌కే పాన్ షాప్‌లిలి మరియు లిలితవక్కల్ పాన్ షాప్‌లిలిలలో నిషేధిత గుట్కా, పాన్ మసాలా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు శంషాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లిలికె. నరేందర్ రెడ్డిలిలి తెలిపారు. ప్రజలు గంజాయి, గుట్కా వంటి నిషేధిత పదార్థాల విక్రయాలపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

# రాయి ప్రకాష్ చక్రవర్తి జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం




జగ్గంపేట,పల్లెవెలుగు సోమవారం జూన్ 15 :- ది హెల్పింగ్ వారియర్స్ సంస్థ అధ్యక్షులు దివంగత రాయి ప్రకాష్ చక్రవర్తి 42వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రజ్ఞ పాఠశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హెల్పింగ్ వారియర్స్ మరియు రాయి చక్రవర్తి మిత్ర బృందం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వంద మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ చక్రవర్తి అరుదైన స్నేహశీలి అని కొనియాడారు. ఆయన కుటుంబానికి మరియు సోదరుడు రాయి సాయికి పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో జీనుమణి బాబు అడబాల వెంకటేశ్వరరావు పాండ్రంగి రాంబాబు బండారు రాజా మీసాల చినబాబు సురేష్ రాయి సాయి వేములకొండ జోగారావు మారిశెట్టి రాధా తోలేటి సూర్యనారాయణ నలమాటి ఆనంద్ గున్నబతుల అనుష రాయి సాగర్ సతీష్ బుదిరెడ్డి శ్రీనివాస్ సూరపురెడ్డి నరేష్ కురుమళ్ళ నాగేశ్వరరావు సుధాకర్ సాయి వెంకన్న కుప్ప గణేష్ బుదిరెడ్డి వంశీ పైడి బాబి శ్రీను చింతల నాని కొయ్య లోవ కుమార్ పవన్ కింగం ప్రవీణ్ పాల్గొన్నారు

# మంత్రి మల్లాడికి ఇంద్రనగర్ ఎమ్మెల్యే ఏకేడి ఆర్ముగం ఘన సన్మానం

యానాం,పల్లెవెలుగు సోమవారం జూన్ 15 :- పుదుచ్చేరి అసెంబ్లీ కార్యాలయంలో మంత్రి మల్లాడి కృష్ణారావును ఇంద్రనగర్ ఎమ్మెల్యే ఏకేడి ఆర్ముగం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ భేటీలో పుదుచ్చేరి మరియు యానాం ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి పనుల గురించి ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై వీరు దృష్టి సారించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా వీరు చర్చించుకున్నారు



## యానాం పరిపాలనాధికారిని కలిసిన వర్తక సంఘం

యానాం,పల్లెవెలుగు సోమవారం జూన్ 15 :- యానాం ప్రాంతంలో ప్లాస్టిక్ వినియోగం



మరియు తలెత్తుతున్న సమస్యలపై వర్తక సంఘం సభ్యులు సోమవారం స్థానిక పరిపాలనాధికారి (=ూ) ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై పరిపాలనాధికారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. టీ, కాఫీ, వేడి కూరలు మరియు సాంబారు వంటి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తక్షణమే నిలిపివేయాలని సూచించారు. వీటితో పాటు అన్ని రకాల ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు వాడకూడదని, అలాగే కుళ్లిన కూరగాయలను షాపుల ముందున్న డ్రైనేజీల్లో వేయకూడదని ఆదేశించారు. ఈ విషయంపై మంత్రి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి నుండి యానాం వర్తక సంఘం ప్రతినిధులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను పుదుచ్చేరి నుండి వచ్చిన వెంటనే పరిపాలనాధికారితో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని, వర్తకులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు పోలీసుల పరంగా తలెత్తుతున్న ఇబ్బందులపై చర్చించి పరిష్కారం చూపిస్తానని మంత్రి భరోసానిచ్చారు